PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 147, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 17 - జూలై - 2026 , వెల రూ.5/-

# 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

- పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు
- ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు"
- ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు.'
- ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం



తాడేపల్లి: పార్టీ కేంద్ర కార్యాలయంలో 'జగన్ 2.0 సూపర్ యాప్'ను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తలు కోసం యాప్ డిజైన్ చేశారు. పార్టీ నేతలంతా నేరుగా కార్యకర్తలతో టచ్‌లో ఉండేలా ఈ యాప్‌ను రూపొందించారు. సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నుంచి ఇవాళ అధికారిక 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరిస్తున్నామన్నారు. "ఈ రోజు ఏం జరుగుతోంది అంటే.. సోషల్ మీడియాలో మన వాళ్లు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం.. మిగతా.. 2లో

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్



2లో

హైదరాబాద్, : ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్



2లో

## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి

### గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్

- తెలంగాణలో అమరరాజా సరికొత్త తయారీ కేంద్రం
- వైసీపీ హయాంలో అమరరాజాను తీవ్రంగా వేధించారన్న లోకేశ్
- ఏపీలో మళ్లీ కీలకపాత్ర పోషించాలని ఆకాంక్ష



అమరావతి: తెలంగాణలో అమరరాజా గ్రూప్ సరికొత్త తయారీ కేంద్రాన్ని (గిగా ఫ్యాక్టరీ) ప్రారంభిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థ ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. అమరరాజా అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆయన బహిరంగంగా మిగతా.. 2లో

## సొంత పార్టీ నేతపై వేటు..

- అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్
- తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావు లేదన్న విజయ్
- ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని వెల్లడి
- అవినీతికి పాల్పడేవారికి రెండో ఛాన్స్ ఉండదని స్పష్టీకరణ



తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన మిగతా.. 2లో

## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

- కీలక మిషన్ల శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రం కఠిన నిర్ణయం
- శాస్త్రవేత్తల రాజీనామాలు ఇక సాధారణంగా ఆమోదించ వద్దని ఆదేశం
- తుది నిర్ణయం అంతరిక్ష శాఖే తీసుకోనుందంటూ అంతర్గత మెమో



2లో

ఢిల్లీ,: ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలో ఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం..

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు



2లో

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్



2

- పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సత్యకుమార్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు
- పోలవరం కోసం మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం రెడీగా ఉందన్న సత్యకుమార్
- పోలవరంను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న మాధవ్

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి



2లో

ఢిల్లీ,:పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..

### 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

- ★ భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ★ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- ★ త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన
- ★ పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- ★ నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం




అమరావతి,: రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల మిగతా.. 2లో

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి



2లో

- పూరీ జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని భక్తులకు పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు
- ప్రతి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన పవన్
- ప్రతి ఇంటిని సుఖ సంతోషాలతో నింపాలని ఆకాంక్ష

## కేసీఆర్ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశారు.. మంత్రి ఉత్తమ్ ధ్వజం



భద్రాద్రి కొత్తగూడెం, : కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా

- ప్రభుత్వం తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందన్న అంబటి
- ముద్రగడ బతికున్నప్పుడు ఆయనను చిత్రహింసలకు గురిచేశారని మండిపాటు
- ప్రభుత్వంపై కాపు సామాజికవర్గంలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని వ్యాఖ్య



2లో

అమరావతి,: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల వేళ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై తనపై కేసు నమోదు కావడం పట్ల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని

## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

మొదటి పేజి తరువాయి

జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం.. గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120 మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్-3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసినవారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్-3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

## హర్మూజ్ జలసంధికి వెళ్లొద్దు.. భారత నావికులపై కేంద్రం ఆంక్షలు

ఢిల్లీ,:గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల్లో భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ భారత నావికులను తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు నియమించవద్దని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నౌకల యజమానులు, షిప్ మేనేజర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు (ఆర్‌పీఎస్ఎల్) ఈ నిబంధనను తక్షణమే పాటించాలని సూచించింది. ఈ వివాదాస్పద ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇటీవల మొంబాసా బి, అల్ బహ్యా, జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ వెద్యాన్, అల్ రెకయ్యాత్ వంటి వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో ప్రయాణించే నావికులకు, నౌకలకు ప్రమాదం గణనీయంగా పెరిగిందని తన ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలు విధించినట్లు స్పష్టం చేసింది.

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడమే ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం. ఇరాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం, ప్రతిగా ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తిరిగి విధించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. తాము అమెరికాతో జీవన్మరణ పోరాటం చేస్తున్నామని, తమ ప్రాంతంలో ఇంధన ఎగుమతులను అడ్డుకుంటామని హెచ్చరించింది. ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇప్పటికే ఉన్న నౌకలకు సూచనలు


ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి, దాని పరిసర జలాల్లో ఉన్న నౌకల కెప్టెన్లు (మాస్టర్స్) అత్యంత అప్రమత్తంగా ఉండాలని డీజీఎంఏ సూచించింది. భద్రతాపరమైన హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ, అంతర్జాతీయ నౌక, నౌకాశ్రయ భద్రతా నియమావళి (×ూూ జశీఎవ) ప్రకారం రూపొందించిన షిప్ సెక్యూరిటీ ప్లాన్‌ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే, వెంటనే డీజీ కమ్యూనికేషన్ సెంటర్ (ఎంఎండీఏసీ) లేదా భారత నౌకాదళానికి చెందిన ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-ఇండియన్ ఓషన్ రీజియన్‌ను (ఐఎఫ్‌సీ-ఐఓఆర్) సంప్రదించాలని తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని డీజీఎంఏ భరోసా ఇచ్చింది.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

హైదరాబాద్, : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి

### గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్



క్షమాపణలు చెప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జగన్ హయాంలో సొంత రాష్ట్రంలోనే ఎంతో ఆదరణ, ప్రోత్సాహం దక్కాల్సిన అమరరాజా వంటి దిగ్గజ సంస్థ తీవ్ర వేధింపులకు గురైందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేధింపుల కారణంగానే ఆ సంస్థ ఏపీ వదిలి పక్క రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "గత ప్రభుత్వ దుందుడుకు చర్యల వల్ల జరిగిన నష్టానికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున మీకు క్షమాపణ చెప్పాలి" అంటూ అమరరాజా సంస్థ అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి లోకేశ్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోందని లోకేశ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరరాజా గ్రూప్ చేపట్టబోయే విస్తరణ పనుల్లో ఆంధ్రప్రదేశ్ మళ్లీ కీలక పాత్ర పోషించాలని, ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

లోకేశ్ సోషల్ మీడియా పోస్టు ఇలా..

"జయదేవ్ గల్లా, ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పి తీరాలి. గత నాలుగు దశాబ్దాలుగా అమరరాజా, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విజయగాథల్లో ఒకటిగా మాత్రమే నిలవలేదు. అది మన రాష్ట్రానికి అంతకుమించి ఎంతో చేసింది. ప్రపంచ స్థాయి తయారీ పరిశ్రమను సృష్టించింది, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించింది, చిత్తూరు జిల్లా పేరును, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో మీ సంస్థ ఎదుర్కొన్న వేధింపులు నిజంగా జరగకూడనివి. సొంత రాష్ట్రంలో పరిశ్రమ పెట్టి, అభివృద్ధి చేయాలనుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాల్సి పోయి, బెదిరింపులు ఎదురయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఒక కంపెనీ, తన తదుపరి వృద్ధి కోసం మన రాష్ట్ర సరిహద్దులు దాటి చూడాల్సి రావడం నన్ను వ్యక్తిగతంగా ఎంతో బాధిస్తోంది. మేము ప్రజల నమ్మకాన్ని తిరిగి నిలబెడుతున్న ఈ తరుణంలో, నేను మీకు ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ మరోసారి పరిశ్రమలకు, వ్యాపారాలకు అనుకూలమైన రాష్ట్రంగా మారింది. అమరరాజా ప్రస్థానంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన అధ్యాయాలు దాని ప్రయాణం ప్రారంభమైన ఈ రాష్ట్రంలోనే లిఖించబడతాయని నేను ఆశిస్తున్నాను. మా తలుపులు, మా హృదయాలు మీ కోసం ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. తెలంగాణలో మీరు ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్ సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని తన సోషల్ మీడియా పోస్ట్‌లో లోకేశ్ పేర్కొన్నారు.

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## మేం వచ్చాక స్కూళ్లలో హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

హైదరాబాద్, : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిపై బలవంతంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ డైరీలో ఈ హోంవర్క్ రాసినట్లు చెబుతున్నారు. మరోవైపు, కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఇలాంటి ఘటన తమ పాఠశాలలో ఇదే తొలిసారి జరిగిందని వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై బీజేపీ నేతలు స్కూల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వెళ్లే మార్గాలను మూసివేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. తెలంగాణలోని కొన్ని పాఠశాలలు హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని చిన్నారులను ఇస్లాం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని జైలుకు పంపాలని అన్నారు.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

మొదటి పేజి తరువాయి


ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## 100 కేసులు పెట్టినా భయపడను.. ముద్రగడ ఆత్మ శాంతి కోసమే అడ్డుకున్నా

మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వంలో కాపులపై వేధింపులు విపరీతంగా పెరిగాయని ఆరోపిస్తూ, తనను ప్రభుత్వం వ్యక్తిగతంగా టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను అంబటి రాంబాబు పూర్తిగా సమర్థించుకున్నారు. చనిపోయిన తర్వాత కూడా ముద్రగడ భౌతికకాయం వద్ద రాజకీయం చేయాలని చూశారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ పద్మనాభం బతికున్నప్పుడు ఆయన్ను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, చనిపోయాక ఇప్పుడు అధికారిక లాంఛనాలు ఇస్తామనడం రాజకీయ కుట్రని అంబటి ఆరోపించారు. "ప్రభుత్వ లాంఛనాలు మాకొద్దు అని ఆయన కుటుంబం ముందే స్పష్టం చేసింది. వాళ్లు వద్దంటున్నా పోలీసులు ఎందుకు వచ్చారు? ముద్రగడ ఆత్మ శాంతించడం కోసమే మేము పోలీసులను అడ్డుకున్నాం. ఇందులో ఎలాంటి తప్పు లేదు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర డీజీపీ తనపై ప్రత్యేక నిఘా పెట్టారని అంబటి ఆరోపించారు. రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అమరావతి వెళ్లినప్పుడు, అలాగే రాజమండ్రి జైలు నుంచి బయటకు వస్తున్నప్పుడు కూడా తనపై అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. తనపై వంద కేసులు పెట్టుకున్నా భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. "తాను కాపుల ప్రతినిధిని కానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పుకున్నప్పుడు, ఆయన ఇంకా కూటమిలో ఎందుకు కొనసాగుతున్నారు?" అని అంబటి ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కాపు సామాజికవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్



అమరావతి,: రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కరవు రక్కసిని తరిమికొట్టేందుకు గోదావరి జలాల తరలింపే శాశ్వత పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ భారీ ఆర్థిక మద్దతు ఇస్తోందని ఆయన కొనియాడారు. ఈరోజు జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర సందర్భంగా.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,700 కోట్లను విడుదల చేసిందని సత్యకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఈ సందర్శన యాత్ర ద్వారా ప్రాజెక్టులోని లోటుపాట్లను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రాబోయే పది రోజుల్లోనే నీటిని విడుదల చేస్తామని పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమను సైతం సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులను శరవేగంగా పరుగులు పెట్టించేందుకు సిద్ధమవుతోంది.

## జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి

అమరావతి,: పవిత్రమైన పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా, శాంతిసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఒక భక్తిపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. పవిత్రమైన ఈ రథయాత్ర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని.. అది అచంచలమైన విశ్వాసానికి, భక్తికి, అలాగే భగవంతునికి, భక్తుడికి మధ్య ఉండే శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. పవిత్ర రథాలపై స్వామివారు, అమ్మవారు ముందుకు సాగుతుండగా... ఆ జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిల దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి మానసిక బలాన్ని, ప్రతి జీవితానికి సరికొత్త ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ కలియుగ దైవం మనందరినీ ఎల్లప్పుడూ ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దీనితో పాటు, సమాజానికి వినమ్రతతో, నిష్కల్మషమైన భక్తితో సేవ చేసేలా.. మనందరికీ అవసరమైన జ్ఞానాన్ని, ధైర్యాన్ని ఆ స్వామి ప్రసాదించాలని కోరారు. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుని దివ్య అనుగ్రహం మన జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక బలంతో కూడిన ఒక ఉన్నతమైన భవిష్యత్తు వైపు మన సమాజాన్ని నడిపించాలని ఆకాంక్షించారు.

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

మొదటి పేజి తరువాయి

పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టైయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'జగన్ 2.0 సూపర్ యాప్' ఆవిష్కరణ

మొదటి పేజి తరువాయి




సోషల్ మీడియాలో మన వాళ్లు పోస్ట్ చేసిన కంటెంట్‌ను ఇష్టం వచ్చినట్లుగా డిలీట్ చేయడం, అందుకోసం ఇష్టానుసారం కుట్రలు పన్నడం.. ఇవన్నీ జరుగుతున్న నేపథ్యంలో మనమే ఒక యాప్ తీసుకొచ్చి ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. అదే జగన్ 2.0 సూపర్ యాప్. దీంట్లో ప్రతి కార్యకర్త నిర్భయంగా తన అభిప్రాయం చెప్పొచ్చు. ..అంతే కాకుండా దీని ద్వారా ప్రతి కార్యకర్త పార్టీతో అనుసంధానమై ఉంటాడు. ఇది మన యాప్ కాబట్టి, మన వాళ్లే ఇందులోకి వస్తారు కాబట్టి, ఎవరు పడితే వారు డిలీట్ చేసే హక్కు కూడా వారికి ఉండదు. ఇది ఒక మంచి పరిణామం. ఇష్టం వచ్చినట్లు చేసే కుట్రలు కూడా దీనివల్ల తిప్పి కొట్టొచ్చు." అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఇంకా పార్టీలో ఉన్న చిన్న కార్యకర్త మొదలు, పార్టీ కేంద్ర కార్యాలయం వరకు.. నియోజకవర్గస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడితో, ప్రతి కార్యకర్త అనుసంధానమై ఉంటాడు. ఎందుకంటే పార్టీలో ప్రతి ఒక్కరికి ఇది అందుబాటులో ఉంటుంది కాబట్టి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కానీ, పోలీసుల వేధింపుల వల్ల కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు కానీ, పార్టీకి సంబంధించిన ఏ అంశంపై కానీ, ఈ యాప్ ద్వారా నేరుగా ఒకరితో ఒకరు అనుసంధానమై టచ్‌లో ఉండే అవకాశం ఉంటుంది. ఈ యాప్‌లో మరో మంచి అంశం ఏమిటంటే, పార్టీలో మనం నిర్వహించే ప్రతి సమావేశం, ప్రెస్‌మీట్లు, ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రకటనలు.. అన్నీ కూడా ఈ యాప్‌లో లైవ్ ఫీడ్ ద్వారా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటుంది. భవిష్యత్తులో ఈ యాప్‌ను ఇంకా అభివృద్ధి చేయడం జరుగుతుంది. కార్యకర్తలు ఎక్కడైనా, ఏమైనా ఇబ్బంది పడుతుంటే వాటిని ఈ యాప్‌లో పోస్ట్ చేయడం, ఆ తర్వాత పార్టీ వాటిపై స్పందించడం, నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఆ కార్యకర్తకు అండగా నిలబడే అవకాశం కూడా ఉంటుంది. ..పోలీసుల వేధింపులతో ఇబ్బంది పడుతున్న మన పార్టీ వారు, ఇంకా రాజకీయ వేధింపులకు కూడా గురవుతున్న వారు ఇప్పుడు డిజిటల్ డైరీలో నమోదు చేస్తున్న వివరాలు.. ఆ డైరీ కూడా ఈ యాప్‌తో అనుసంధానం అవుతుంది. అంటే ఈ యాప్‌లో ఆ డిజిటల్ డైరీ కూడా అందుబాటులోకి వస్తుంది. దాని వల్ల వేధింపుల, సమస్యలు ఎదుర్కొంటున్న వారు నేరుగా ఈ యాప్ ద్వారా డిజిటల్ డైరీలో వాటిని ఫిర్యాదు చేయొచ్చు. ఆ వివరాలు నమోదు చేయొచ్చు. ..ఇతర సోషల్ మీడియా వేదికల్లో మనపై చేస్తున్న అనుచిత విమర్శలు, వీడియోలు, వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసి, వాటిని తొలగింపచేసే ప్రయత్నం ఒకవైపు చేస్తూనే, మరోవైపు ఈ సూపర్‌యాప్‌ను ఎవరూ ఆపలేని విధంగా మనకు మనం సొంతంగా రూపొందించుకోవడం జరిగింది. ఈ యాప్ వల్ల ప్రతి కార్యకర్త నిత్యం, పార్టీ నాయకత్వంతో అనుసంధానమై ఉంటాడు" అని వైఎస్ జగన్ వివరించారు.

## పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

ఒడిశా: ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

## సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు. ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

## శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రుల ప్రారంభం..!!

**తొలిరోజు పూజలో పాల్గొన్న బిజేపి నేత కేఎన్ఆర్ జ్యోతి దంపతులు**



( నేటి శుభోదయ జులై : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక వడ్లపూడి ఈసేవా మైదానంలో శ్రీ వెంకటేశ్వర వైదిక్ సంస్థాపనమ్ అధ్యక్షులు వేదపండితులు హరీష్ శర్మ ఆధ్వర్యంలో ఆషాడ వారాహి గుప్త నవరాత్రుల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి ప్రాణ ప్రతిష్ట చేసారు. ప్రాంగణం అంతా సర్వాంగ సుందరంగా అలంకరించారు. బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు జ్యోతి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ శ్రీ వారాహి అమ్మవారికి నిష్ఠగా పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని అని అన్నారు. హరీష్ శర్మ మాట్లాడుతూ పదిహేడవ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీ దత్తేశ్వరానంద సరస్వతి స్వామి వారి చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులు అందరూ వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బొండా యల్లాజీరావు,చిరు బారీగ భక్తులు పాల్గొన్నారు.

## గరికిన దుర్గాప్రసాద్ రాజు మరణం బిజేపికి తీరని లోటు..!!

**కే, ఎన్, ఆర్, పరశురామరాజు**



( నేటి శుభోదయ జులై : 16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) బిజేపి సీనియర్ నాయకులు గంగవరం మండలం ఇంచార్జ్ గరికిన పైడిరాజు 64వ వార్డు అధ్యక్షురాలు మాధవి కుమారుడు బిజేపి నాయకులు కీశే శ్రీ గరికిన దుర్గాప్రసాద్ రాజు పెద్ద కర్మ గంగవరం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద జరిగింది. జిల్లా అధ్యక్షులు పరశురామరాజు , రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొని వారి చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గా ప్రసాద్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి మరణం బిజేపికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణంరాజు, ములకలపల్లి ప్రకాష్, గూటూరు శంకరరావు,పొలిమేర శ్రీనివాసరావు, దాడి రమేష్,కిలాని ముసలయ్య,బాటా శ్రీను, పేర్ల సత్యారావు,జిలకర్ర భువనేశ్వరి,రూపాదేవి,వరలక్ష్మి, రమణ,ఈశ్వరరావు,కోసూరు తాతారావు,రాకేష్,రంజిత్,ప్రసన్న,కేవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలి..!!

**– రాష్ట్రంలో జూలై 31న జర్నలిస్టుల డిమాండ్స్ డే – పెన్షన్ సదుపాయం – ప్రమాద బీమా పునరుద్ధరించాలి**



( నేటి శుభోదయ జులై :16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి జూలై 31న జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది... ఈ మేరకు మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్ లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టులకు సంబంధించిన అనేక పెండింగ్ సమస్యలు పై కార్యవర్గం చర్చించడం జరిగిందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ..ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించిన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో విపులంగా వివరించడం జరిగిందన్నారు.. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం కేటాయించాలని అలాగే పెన్షన్ సదుపాయం అమలు చేయాలని.. ప్రమాద బీమా ను పునరుద్ధరించాలని ఇలా ఆరు డిమాండ్లపై కార్యవర్గం తీర్మానం చేయడం జరిగింది అన్నారు.. తాము లేవనెత్తిన అనేక అంశాలకు సంబంధించి రాష్ట్ర అధ్యక్ష.. కార్యదర్శులు వెంకట్రావు జి ఆంజనేయులు.. ఇతర కార్యవర్గం సానుకూలంగా స్పందించిందని.. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించడంతోపాటు అదే సమయంలో ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కార్యవర్గం నిర్ణయించడం జరిగిందని గంట్ల శ్రీనుబాబు వివరించారు.. ప్రధాన డిమాండ్లతో ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.. అలాగే సచివాలయంలో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇతర మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరడం జరుగుతుందన్నారు.. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు..

విశాఖ అర్బన్ అధ్యక్షులు పి నారాయణ.. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఏ సాంబశివరావు.. ఉపాధ్యక్షులు పి..నగేష్ బాబు.. జాయింట్ సెక్రెటరీ గొడబ రాంబాబు.. బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు. కార్యదర్శి కింతాడ మదన్.. అనకాపల్లి జిల్లా అధ్యక్షులు. వెంకటేష్.. ఖాదర్.. బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు భాష.. హమీద్ తదితరులు పాల్గొన్నారు

## 87వ వార్డు లో జోనల్ కమిషనర్ పర్యటన..!!

**– వార్డు సమస్యలను వివరించిన మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్)**



( నేటి శుభోదయ జులై :16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో మాజీ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి నాయుడు సుడిగాలి పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఓపెన్ షెడ్లు సామాజిక భవనాలు 87వ వార్డులో మంజూరయ్యాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు మేరకు జోనల్ కమిషనర్ స్వయంగా స్థల పరిశీలన చేయాలని అందులో భాగంగా నాయి బ్రాహ్మణ వీధిలో స్లాబ్ ఎక్స్టెన్షన్, దానప్ప తల్లి గుడి సమీపంలో మరియు కణితి అంబేద్కర్ కాలనీలో నిధుల కొరతతో నిలిచిపోయిన సామాజిక భవనాలు , కణితి గవర వీధిలో సామాజిక భవనం ఏర్పాటు కొరక స్థల పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం మాట్లాడుతూ ఈ సమాజిక భవనాలు ఆయా సంఘాలకు అవసరమని వీటికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్య విధంగా కృషి చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఈ ఈ ఎంఆర్ఎఫ్ అప్పారావు. ఏ ఈ మహాలక్ష్మి.వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, జాన్ రమేష్, ఆదినారాయణ,సుందర సునీల్, కనక సత్యం, బొడ్డేటి దేవుళ్ళు. బి శ్రీకాంత్ రవి. కేశవ్ తదితరులు పాల్గొన్నారు

# జూలై 30న ఘట్టమనేని జయకృష్ణ ‘శ్రీనివాస మంగాపురం’ విడుదల!

**– విశాఖలో సందడి చేసిన చిత్ర యూనిట్**

**– బాబాయ్ మహేష్ బాబు చెప్పిన మెలకువలు ఎంతో ఉపయోగపడ్డాయి: హీరో జయకృష్ణ– వైజాగ్ అంటే నాకు చాలా ఇష్టం: హీరోయిన్ రషా తడాని**



( నేటి శుభోదయ జులై : ?16 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ మనవడు, రమేష్ బాబు సుపుత్రుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా టాలీవుడ్‌కు పరిచయమవుతున్న చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరో జయకృష్ణ, హీరోయిన్ రషా తడానితో కూడిన చిత్ర యూనిట్ బుధవారం విశాఖపట్నంలో సందడి చేసింది. బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

అభిమానుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి: హీరో జయకృష్ణ

ఈ సందర్భంగా హీరో జయకృష్ణ మాట్లాడుతూ.. ఘట్టమనేని కుటుంబంపై, తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ‘శ్రీనివాస మంగాపురం’ చిత్రం ఎంతో అద్భుతంగా వచ్చిందని, ప్రేక్షకుల ఆదరణతో సినిమా తప్పకుండా సూపర్ హిట్ సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ సినిమా షూటింగ్ సమయంలో తన బాబాయ్, సూపర్ స్టార్ మహేష్ బాబు నటనకు సంబంధించి చెప్పిన మెలకువలు, టిప్స్ తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని జయకృష్ణ గుర్తుచేసుకున్నారు. అనంతరం సమావేశానికి విచ్చేసిన అభిమానులతో ఆయన నవ్వుతూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.అమ్మలాగే నన్నూ ఆదరిస్తారని నమ్ముతున్నా: హీరోయిన్ రషా తడాని హీరోయిన్ రషా తడాని మాట్లాడుతూ.. ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన తల్లి, ప్రముఖ నటి రవీనా టాండన్‌కు తెలుగులో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని, అమ్మలాగే తనను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఇదొక విలక్షణమైన ప్రేమకథని, ఎవరూ ఊహించని రీతిలో కథనంలో ఉండే ట్విస్టులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని చెప్పారు. థియేటర్ నుండి బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ ఒక మంచి లవ్ స్టోరీ చూశామనే సంతోషంతో వస్తారన్నారు.?విశాఖపట్నం నగరంపై రషా తడాని ప్రశంసల జల్లు కురిపించారు. వైజాగ్ తనకు ఎంతో నచ్చిన ప్రాంతమని, ఇక్కడి సుందరమైన బీచ్, సిటీ వాతావరణం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. వైజాగ్ ప్రజలు ఎంతో ఆప్యాయతను చూపిస్తారని, వారు చాలా మంచివారని ఆమె తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. జూలై 30న రాబోతున్న ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది.

## గోదావరి,కృష్ణా డెల్టాల శివారు భూములకు సాగునీరు అందించండి

**--- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం డిమాండ్**



ఏలూరు, నేటి శుభోదయ ::: గోదావరి,కృష్ణా డెల్టాల శివారు భూములకు సాగునీరు అందించే చర్యలు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. పంటలు ఎండిపోకుండా కాపాడాలని, వివిధ పంటల రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి డెల్టా కాలువలకు జూన్ 1న ఖరీఫ్ సాగు కోసం నీరు విడుదల చేశారని, రైతులు నారుమళ్లు వేశారని, అయితే ప్రస్తుతం నారుమళ్ళకు కూడా నీళ్లు అందక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కృష్ణా డెల్టా భూములకు జూలై 1న నీరు విడుదల చేసినా ఇంతవరకు సాగునీరు అందక పంట భూములు బీళ్ళుగా ఉన్నాయని చెప్పారు. ఏలూరు జిల్లా పరిధిలో దెందులూరు, కైకలూరు,నూజివీడు, ఉంగుటూరు నియోజకవర్గాల పరిధిలో వరి పంట సాగుకు నీరు అందడం లేదని ఫలితంగా రైతులకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతలు, తాడిపూడి ఎత్తిపోతలు పథకాలు ప్రారంభించామని, కాలువల్లో సమృద్ధిగా సాగునీరు ఉందని ప్రభుత్వం చెబుతున్నా పంట భూముల్లో నీరు ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణా, గోదావరి డెల్టాల శివారు భూములకు సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. భారతదేశ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మన కేంద్ర ప్రభుత్వం సంతకం చేయవద్దని ఈనెల 22న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో నిరసన కార్యక్రమాలకు రైతాంగం సమయత్తం కావాలని కోరారు. అమెరికాతో వాణిజ్య ఒప్పంద వలన పాడి,పౌల్ట్రీ, మొక్కజొన్న, పత్తి తదితర పంటల రైతులు తీవ్రంగా దెబ్బతింటారని చెప్పారు.ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని, వర్జీరియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు జీవీ కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, వెలగలేటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడు నియోజకవర్గం కురుబ సంఘం నూతన కమిటీ ఎన్నిక



అనంత పురం జూలై 16 నేటి శుభోదయ:అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ సంఘం ఆధ్వర్యంలో రాప్తాడు నియోజకవర్గం కురుబ సంఘం నూతన కమిటీని ప్రకటించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె. మల్లికార్జున,రాష్ట్ర కార్యదర్శి దొనస్వామి వారి చేతుల మీదుగా రాప్తాడు నియోజకవర్గం కమిటీ సభ్యులను అధికారికంగా ప్రకటించడం జరిగింది.నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు వివరాలు ఇలా ఉన్నాయి.రాప్తాడు నియోజకవర్గం:గౌరవ అధ్యక్షులు .చిట్రా నరేంద్ర, అధ్యక్షులుబిల్లే రామాంజినేయులు ఉపాధ్యక్షులు :చిట్రా అహోబిలప్ప ప్రధాన కార్యదర్శి: అవిలిగొండ ఈశ్వరయ్య కోశాధికారి :వేపచర్ల బచ్చలయ్య కార్యదర్శి అడ్ర ఈశ్వరయ్యనూతనంగా నియమితులైన నియోజకవర్గం కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధి, కురుబ, కురుమ సమాజ హక్కుల పరిరక్షణ, యువతకు మార్గదర్శనం సామాజిక సేవలో ముందుండి పనిచేయాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబలు ఎక్కువగా వున్న చోట్ల అవకాశం వస్తే తప్పకుండా పోటీ చేసి గెలిపించుకునే సత్తా కురుబలకు ఉందని సంఘం బలోపేతానికి పాటు పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గవ్వల రామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య చిట్రా సీనయ్య ,బండి పవన్ కుమార్ అనంతపురం జిల్లా కురుబ యువజన సంఘం అధ్యక్షులు నీళ్లపాల రాజగోపాల్, శింగనమల నియోజకవర్గం కురుబ సంఘం అధ్యక్షులు పట్నం నగేష్ ,బిల్లే ఆంజనేయులు (భోగినేపల్లి ) బండి వెంకటరమణ, చెన్నక్కి ఈశ్వరయ్య కే చంద్రమోహన్ పాళ్యం ప్రసాద్ బుడగ శాంత లింగం చిట్ర చంద్రశేఖర్, సుధాకర్ బుల్లె శ్రీనివాసులు బుల్లె వీర నారప్ప చిరుతల ఆనంద్ జి. రవి గుండ్లమడుగు మోహన్ , కే నాగభూషణ్ , కోలాల ఉజ్జన్న, బిల్లే నాగభూషణ ,కురుబ గోపాల్ రామచంద్ర రాప్తాడు నియోజకవర్గం కురుబ సంఘం నాయకులు కులస్తులు పాల్గొన్నారు

## “వైసీపీ కార్యకర్తలను పరామర్శించిన వైసీపీ ఇంచార్జ్ వడ్డు రఘురామ నాయుడు”



పెంటపాడు జూలై 16 (అవినాష్ మారంపూడి నేటి– శుభోదయ):::: పెంటపాడు మండలంలో ఇటీవల మరణించిన వైసీపీ కార్యకర్తల కుటుంబాలను తాడేపల్లిగూడెం వైసీపీ ఇన్చార్జ్ వడ్డి రఘురామనాయుడు పరామర్శించారు. ముందుగా బోడపాడు మాజీ సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకుడు కునుకు పుల్లయ్య అన్నయ్య కుమారుడు కునుకు వరప్రసాద్ అకాల మరణం చెందారు. ఈ విషయం తెలిసి గురువారం బోడపాడు గ్రామానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించి పూలమాలలు వేశారు. అనంతరం దర్శి పర్రు శివారు బిల్లగుంట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త యందం గాంధీ పెదనాన్న అయిన యందం వెంకటరావు ఇటీవల గుండెపోటు తో మరణించారు. ఈ విషయం తెలిసి వెంకట్రావు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం తాడేపల్లిగూడెం 18 వ వార్డు కి చెందిన దాసి శ్రీను భార్య ఇటీవల మరణించారు ఈ విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని పార్టీ ఇన్చార్జిగా పరామర్శించి పార్టీ మీకు ఇప్పుడు తోడుగా ఉంటుందని ఏం అవసరం వచ్చిన పార్టీ మీకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల వైసీపీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, వింజమూరు శ్రీనివాస్, కునుకు పుల్లయ్య, మాజీ సర్పంచ్ గేదెల శివకుమార్, ఈ. పెద్దిరాజు, బర్ల జయ రాంబాబు, ద్వారంపూడి కిరణ్ కుమార్ రెడ్డి, మాకరాజు సతీష్, డాక్టర్ మారంపూడి రవికుమార్, ఉండ్రాజవరపు రాజు, బిల్లగుంట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు యంధం గాంధీ, యజ్జల పెంటయ్య, కళింగ చినబాబు, యందం ఏడుకొండలు, యందం రాజు, మూలారి ఏసు (పాస్టర్),యందం ఏడుకొండలు, యందం శ్రీను వాస్, కళింగ చిరంజీవి, మోర్చ బాబురావు, యందం రమేష్ మరియు వైసీపీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## “చిన్నారికి వైద్యసహాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి, జనసైనికులు”



తాడేపల్లిగూడెం, జూలై 16 (అవినాష్ మారంపూడి నేటి– శుభోదయ) ;;;;కంటి క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు రూ.20వేలు ఆర్థిక సహకారం అందించారు.జనసైనికులు రూ.1,30,000లు కలిపి మొత్తం రూ.1,51,000లు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత చిన్నారి కుటుంబానికి అందజేశారు.పడమర విప్పరు గ్రామానికి చెందిన పెనుమూలు ఏసు రాజు కుమార్తె 15 నెలల చిన్నారి పెనుమూలు నేహశ్రీ కి కంటి క్యాన్సర్ వైద్యం నిమిత్తం ఈ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారి వైద్యం నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన జనసైనికులను అభినందించారు. వివిధ రకాల సమస్యలతో బాధపడే ప్రజలకు సేవలు అందించే నిమిత్తం జనసేన కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రతి రోజూ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలకు నిరంతర సేవలు అందించే నిమిత్తం ఆరుగురు సిబ్బందిని నియమించామని తెలిపారు. జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు జన సైనికులు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. రాజకీయమంటే అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జనసేన కృషి చేస్తుందని అన్నారు. చిన్నారి వైద్యానికి సహకారం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు,జనసైనికులకు పెనుమూలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమరవిప్పర్రు జనసేన నాయకులు, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి, గంటా సుబ్రహ్మణ్యం, పసల శ్రీకృష్ణ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## “భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల సదస్సును విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వడ్డీ రఘురామనాయుడు”




తాడేపల్లిగూడెం జులై 16 (అవినాష్ మారంపూడి నేటి–శుభోదయ):: భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల సదస్సును చూసి కూటమి ప్రభుత్వంలో వెన్నెల్లో వణుకు పుట్టిందని వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వడ్డు రఘురామనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి భీమవరంలో పెట్టిన బహిరంగ సభను చూసి కూటమి ప్రభుత్వం కంగారుపడుతుందని భీమవరంలో ఉన్న రోడ్లన్నీ జనసముద్రంతో నిండిపోయిందని ఆయన అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతుల సమావేశం విజయవంతంగా ముగిసిందన్నారు.ఈ సమావేశం ద్వారా ఆక్వా రైతుల సమస్యలు, వారి సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించడం జరిగిందని ఆక్వా పరిశ్రమ ఫీడ్ రేట్లు తదితర అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ బహిరంగ సభను చూసి మార్కెట్లో 10 రూపాయలు పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# నీరు అందదు, సాగు సాగదు

**– ఎండిన వరి నారుమడిలో అన్నదాతలు నిరసన**

**– పట్టిసీమ నీరు అందించండి, పంటలు కాపాడండి**

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్**



దెందులూరు, నేటి శుభోదయ ::: నీరు అందదు, సాగు సాగదు అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దెందులూరు మండలం సత్యనారాయణపురంలో బీటలు వారిన వరి నారుమడిలో నారుమడి మట్టి గడ్డలతో అన్నదాతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. సాగునీరు అందించండి, పంటలు కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ముందుగా కొవ్వలి, పోతునూరు గ్రామాలలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి,కృష్ణా డెల్టాల పరిధిలో శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక వరి నారుమళ్లు,నాట్లు వేసిన చేలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం ఇందుకు కారణమని విమర్శించారు. గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నా కాలువలు సక్రమంగా లేక శివారు ప్రాంత భూములకు సాగినీరు అందడం లేదని చెప్పారు.



గోదావరి ప్రధాన కాలువలో గుర్రపు డెక్క,తూడు, కర్ర నాచు తొలగించే చర్యలు చేపట్టకుండా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. పట్టిసీమ కాలువ ద్వారా వస్తున్న నీరును కృష్ణా,గోదావరి డెల్టాలకు మళ్లించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఒక్క దెందులూరు నియోజకవర్గం పరిధిలోనే 50వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదిక స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి. తవుడు, ఎస్. సత్తియ్య, ఏ. అప్పలస్వామి, జి.శివ, పలువురు రైతులు,కౌలు రైతులు పాల్గొన్నారు.

# రాయలసీమకు లైఫ్‌లైన్ హంద్రీనీవా అదనపు జలాలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

**ఈనెల 19న కూడేరు మండలం చోళసముద్రం వద్ద హంద్రీనీవా పనులు పరిశీలన**

**ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్, విశ్వేశ్వరరెడ్డి**



అనంతపురం,బ్యూరో జూలై 16 నేటి శుభోదయ :కరువుకు నిలయంగా ఉన్న రాయలసీమకు హంద్రీనీవా ప్రాజెక్టు లైఫ్‌లైన్ అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రాయలసీమకు అదనపు జలాలే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రాయలసీమ ఎత్తిపోతల పథకం, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైందన్నారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంతతో పాటు మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను అన్ని జిల్లాల్లో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీలు అధ్యయనం చేసి అదనపు జలాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీన కూడేరు మండలం చోళసముద్రం వద్ద హంద్రీనీవా పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. వాస్తవానికి హంద్రీనీవా ద్వారా 6.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల జనాభాకు తాగునీరు అందాల్సి ఉందన్నారు. ఎన్టీఆర్ హయాంలో హంద్రీనీవాకు రూపకల్పన చేశారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 1996లో ఉరవకొండ వద్ద 40 టీఎంసీలకు శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత 1999లో ఆత్మకూరు వద్ద 5 టీఎంసీలకు కుదించిన విషయాన్ని గుర్తు చేశారు. 2004 వరకు హంద్రీనీవా పనులు ముందుకు సాగలేదని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక 2005లో 5 టీఎంసీల జీవో రద్దు చేసి 40 టీఎంసీల సామర్థ్యంతో పనులు శరవేగంగా చేపట్టారని తెలిపారు. దాని ఫలితంగానే 2012లో కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి వచ్చాయని అన్నారు. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే నికర జలాలు లేకుండా మిగులు జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3850 కోట్లతో పనులు చేశామని గొప్పలు చెబుతున్నారని, కానీ అనుకున్న మేరకు నీళ్లు రాలేదన్నారు. ఓ వైపు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీళ్లు తరలిస్తుండడం వల్ల సీమ ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో హంద్రీనీవాను 6300 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసే పనులకు శ్రీకారం చుట్టి టెండర్లు కూడా పూర్తి చేశామన్నారు. ఆలోగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో మళ్లీ చంద్రబాబు 3850 క్యూసెక్కులకే హంద్రీనీవాను పరిమితం చేశారన్నారు. తక్కువ సమయంలోనే 51 టీఎంసీలు తెచ్చామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితి అలా లేదని తెలిపారు. నిజంగా 3850 క్యూసెక్కులు వచ్చి ఉంటే 170 రోజుల్లోనే 51 టీఎంసీలు వస్తాయని, మరి 242 రోజులు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. పైగా హంద్రీనీవా ప్రధాన కాలువను కుదించి బ్రాంచ్ కెనాళ్లను పెంచడం గతంలో ఎక్కడా జరగలేదని తెలిపారు. హంద్రీనీవా లైనింగ్ పనుల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయినట్లు చెప్పారు. హంద్రీనీవా పనుల విషయంలో అంచనాలు పెరగడం తప్పితే ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 19వ తేదీన హంద్రీనీవా పనులను కూడేరు మండలం చోళసముద్రం వద్ద పరిశీలించనున్నట్లు చెప్పారు. ఇదే తరహాలో గ్రేటర్ రాయలసీమ వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల పరిశీలన ఉంటుందన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తీసుకురావడం వల్లే రాయలసీమకు మేలు జరుగుతుందన్నారు. హంద్రీనీవా కెపాసిటీని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ జిల్లా శ్రేయస్సు గురించి ఆలోచించాలని కోరారు. గ్రేటర్ రాయలసీమ నీటి ప్రాజెక్టులు, రాయలసీమ లిఫ్ట్ కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామన్నారు. ఆల్మట్టి, అప్పర్ భద్ర, తెలంగాణలో అక్రమ ప్రాజెక్టుల కారణంగా రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. హంద్రీనీవా విషయంలో ఆదిలోనే గొంతునొక్కే ప్రయత్నాలను గతంలో చంద్రబాబు చేశారని, అందులో భాగంగానే 40 టీఎంసీల సామర్థ్యాన్ని 5 టీఎంసీలకు కుదించారని గుర్తు చేశారు. హంద్రీనీవా నీళ్లు కుప్పంకు వెళ్లకపోతే అసలు ఈ ప్రాజెక్టు గురించే చంద్రబాబు ఆలోచన చేసేవారు కాదన్నారు. ఈనెల 19వ తేదీన చోళసముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువను పరిశీలించి ఆ ప్రాంత రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటామని చెప్పారు.

## జూలై 26న ప్రకాశం జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలు



ఒంగోలు, నేటి శుభోదయ ::: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలను జూలై 26, 2026న ఒంగోలులోని ఆంధ్రకేసరి విద్యా కేంద్రం, అంజయ్య రోడ్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ కార్యాలయం అయోధ్య భవనం లో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బోయపాటి రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు యోగాచార్య బాలసుబ్రమణ్యం గంధవళ్ళ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యోగాసనాన్ని ఒక క్రీడగా ప్రోత్సహిస్తూ ఉన్నదని, దేశవ్యాప్తంగా జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో యోగాసనా పోటీలు నిర్వహిస్తూ ఉన్నదని తెలిపారు. మండలాలలోని ప్రతిభావంతులైన యోగాసన క్రీడాకారులను గుర్తించి, వారికి జిల్లా స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ పోటీలలో సబ్-జూనియర్, జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొనవచ్చు. 55 సంవత్సరాల వయస్సు వరకు క్రీడాకారుల కోసం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారని, ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్, ట్రెడిషనల్ గ్రూప్, మరియు ఆర్టిస్ట్క్ గ్రూప్ వంటి పలు విభాగాలలో పోటీలు జరుగుతాయని వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, యోగా శిక్షణ కేంద్రాలు మరియు యోగా సంస్థల నుంచి క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. పాఠశాలల పీఈటీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, యోగా ఉపాధ్యాయులు మరియు కోచ్ లు తమ విద్యార్థులను ఈ పోటీలకు సిద్ధం చేసి, పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు జూలై 25వ తేదీ వరకు తమ పేర్లను 9963662100, 7780680121, 9885125053, 9490163312 ఈ నంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవచ్చునని, జిల్లాలోని ప్రతిభావంతులైన యోగాసన క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని, భవిష్యత్తులో రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు, పీఈటీలు, యోగా ఉపాధ్యాయులు మరియు కోచ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలను విజయవంతం చేయాలని కోరారు సంస్థ కార్యదర్శి సోమ సుబ్బారావు తెలిపారు. ఒంగోలు, అంజయ్య రోడ్డు నందలి ఆంధ్రకేసరి విద్యా కేంద్రం లో 26వ తేదీ జూలై, ఆదివారం ఉదయం 8 గం.లకు పోటీలు ప్రారంభమవుతాయని సంస్థ అధ్యక్షులు బోయపాటి రవిబాబు తెలిపారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు దేవకుమారి, అనుసంధానకర్త రామానుజ పెరుమాల్, మీడియా విభాగం రాధా రమణ గుప్తా జంధ్యం, దేసు వెంకయ్య, పబ్బిశెట్టి వెంకటసుబ్బయ్య, ధనిశెట్టి రామునాయుడు, పబ్బిశెట్టి హరి తదితరులు పాల్గొన్నారు.

## తమిళ భక్తులతో కిట,కిట లాడిన శ్రీ జగజ్జనని దేవాలయం

**- నంద్యాల పట్టణం లోని శ్రీ జగజ్జనని అమ్మవారి ఆలయంలో గురువారం తమిళ భక్తులతో కిట కిట లాడింది**



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల పట్టణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. ప్రపంచంలోనే రెండో శ్రీ జగజ్జననీ దేవాలయంగా, నిత్య పూజలు అందుకుంటున్న మొదటి దేవాలయంగా విరాజిల్లుతున్న నంద్యాల శ్రీ జగజ్జననీ అమ్మవారు. నంద్యాల జగజ్జననీ నగర్ ఆలయంలో ఆషాఢమాస పుట్టింటి పట్టుచీర -- సారె మహోత్సవాలు రెండవరోజు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమిళనాడులోని మోరాయి, తిరువళ్ళూరు, పల్లిపట్టు, తిరుత్తణి ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో గురువారం నంద్యాలకు వచ్చి శ్రీ జగజ్జననీ అమ్మవారిని దర్శనం చేసుకొని పుట్టింటి పట్టుచీర, సారే సమర్పించారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు ప్రత్యేకంగా నంద్యాలకు చేరుకున్నారు. డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, భజనలు, అమ్మవారి నామస్మరణల మధ్య భారీ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు భక్తి పారవశ్యంలో కోలాటాలు ఆడుతూ, జై జగజ్జననీ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ శోభాయాత్రను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో తలలపై పట్టుచీరలు, సారె పళ్లెలు, పసుపు, కుంకుమ, పండ్లు, కొబ్బరికాయలు, పూలతో కూడిన నైవేద్యాలను మోసుకొచ్చి అమ్మవారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయానికి చేరుకున్న అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దర్శనం, ప్రసాద పంపిణీ, తాగునీరు, అన్నప్రసాదం వంటి సౌకర్యాలను విస్తృతంగా కల్పించారు. ఆషాఢమాసంలో అమ్మవారికి పుట్టింటి నుంచి పట్టుచీర, సారె సమర్పించడం అత్యంత పవిత్రమైన ఆచారంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకునేందుకు, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుతూ వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ మహోత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తమిళ భక్తులు మాట్లాడుతూ ప్రసరసాదనల్లో చూసి మొదటి సారి శ్రీ జగజ్జనని అమ్మవారికి పుట్టింటి పట్టు చీరే, సారే తీసుకొచ్చా మన్నారు. అమ్మవారి విరాట్ స్వరూపం దివ్యమంగళ మనోహరమైన ఆ మహా తల్లి నీ దర్శించుకోవడం పూర్వ జన్మసుకృతం అన్నారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపం గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. ప్రధానంగా ఆలయంలో భక్తులు సంప్రదాయ దుస్తులతో ప్రవేశం మంచి నిర్ణయం అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా ఒక్క పైసా కూడా తీసుకోకుండా కడుపునిండా ప్రసాదం పెట్టడం ఎక్కడా చూడ లేదన్నారు. దేవాలయంలో భక్తులకు దర్శనం,కుంకుమార్చన అన్ని ఉచితంగా చేయడం ఎక్కడ చూడలేదన్నారు. భక్తులు సైతం దేవాలయానికి భారీ విరాళాలు ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రీ జగజ్జనని అమ్మవారి స్వరూపం చూస్తుంటే పక్కకు పోవాలనే ఆలోచనే ఉండదన్నారు. ప్రపంచంలోనే రెండవ దేవాలయమైన ఈ దేవాలయం గురించి తమిళనాడులో అందరికీ తెలిసేవిదంగా చేస్తామని పేర్కొన్నారు.

## 'పోలవరం ప్రాజెక్టు పేరును 'శ్రీరామ పాద సాగర్' గా మార్చవలల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. !!'

**- భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);దేశంలోనే ప్రతిష్టాత్మక మైన పోలవరం ప్రాజెక్టు పేరును 'శ్రీరామ పాద సాగర్' గా మార్చవలల్సిందిగా యావన్మందికి విజ్ఞప్తి చేస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలం, వెదుళ్ళపల్లి గ్రామ కాపురస్తులు నీరుకొండ బులిసాంబం కుమార్డు వీరన్నచౌదరి, స్థానికులు, ఈ ప్రాంతాల ప్రజలు కోరుచున్నారు. సీతానగరం మండలం, పురుషోత్తపట్నం దగ్గరలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఇదవరలో క్రాసుబ్రహ్మనందరెడ్డిచే శంకుస్తాపన చేయునప్పుడు పోలవరం ప్రాజెక్టుకు శ్రీరామపాదసాగర్ అని నామకరణం చేసినారని మద్యలో పని ఆగిపోయినందున ఆపేరు యెవరూ గుర్తించలేదన్నారు. మద్యలో మారిన ప్రభుత్వాలు 'పోలవరం ప్రాజెక్టు'గా పిలుస్తున్నారని, పూర్తిగా ఆధికారికంగా ప్రకటించలేదని, ఈ విషయాన్ని గుర్తించాలని బీజేపీ నాయకులు వీరన్న చౌదరి పేర్కొన్నారు.



రాష్ట్రంలోగల కూటమి పెద్దలతో మరియు కేంద్రంలోగల పెద్దలతో చర్చించి ప్రాజెక్టు పేరును భద్రాచంలోగల శ్రీరాముని పాదాలను తాకి ప్రవహిస్తున్న గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టు పేరును శ్రీరామపాదసాగర్ అని పెట్టవలసినదిగా ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. 15 వ గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించడం కోసం బిజెపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ ర్యాలీ, కార్యక్రమంలో ఈ ప్రాంత ప్రజలు ఒక వినతిపత్రాన్ని సమర్పిస్తున్నట్లు వీరన్న చౌదరి తెలిపారు.

## ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను మంత్రులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి సందర్శన**



అనంత పురం జూలై 16 నేటి శుభోదయ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రాంతంలోని రాయపూడిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను మంత్రులు, అధికారులతో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నేడు పరిశీలించారు. మున్సిపల్ శాఖమంత్రి పొంగూరు నారాయణ, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న నివాస సముదాయంలోని ఫ్లాట్లు, నిర్మాణ నాణ్యత, ఆధునిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన నాయకులు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులకు అత్యుత్తమ వసతి కల్పించాలనే లక్ష్యంతో అమరావతిలోని రాయపూడి ప్రాంతంలో 12 అంతస్తుల చొప్పున 12 భారీ టవర్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. మొత్తం 288 విశాలమైన ఫ్లాట్లు సిద్ధమవగా, ఒక్కో ఫ్లాట్ సుమారు 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించబడింది. నిర్మాణ పనులు దాదాపు పూర్తికాగా, త్వరలోనే ప్రజాప్రతినిధులకు కేటాయించే తుది ప్రక్రియను సీఆర్‌డీఏ చేపట్టనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు ప్రజాప్రతినిధులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అత్యున్నత ప్రమాణాలతో ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ అత్యాధునిక ఎమ్మెల్యే క్వార్టర్స్ మరో నిదర్శనమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. త్వరలోనే ఈ క్వార్టర్స్ ప్రజాప్రతినిధులకు అందుబాటులోకి రావడం ద్వారా రాజధాని పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు..

## అత్యంత వైభవంగా సాయి జగన్నాథ రథోత్సవం



అనంత పురం బ్యూరో జూలై 16 నేటి శుభోదయ :పుట్టపర్తిలో సాయి జగన్నాథ రథోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. సాయి సంకీర్తనలు, భజనలతో పుట్టపర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. వేలాది మంది సాయిభక్తులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని సాయి జగన్నాథ స్వామి రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ లు ముఖ్య అతిథిగా హాజరై రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్నాథ స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం సాయిభక్తులతో కలిసి జగన్నాథ రథాన్ని లాగుతూ సాయి స్మరణలతో మారి మోగింది. ఈ సందర్భంగా డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి ప్రపంచానికి ఆధ్యాత్మిక సందేశాన్ని అందించే పవిత్రక్షేత్రమని అన్నారు. సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావం, భక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు భజనలు, సాయి నామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ ప్రముఖులు, భక్తులు, సేవాదళ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు బ్రాహ్మణపల్లి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని రైతుల కోరిక మేరకు ఆ ప్రాంతాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు ఆర్డీవో సువర్ణ ఇతర శాఖ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏనుములపల్లి చెందిన రైతులు ,మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-శ్రీ కనక దుర్గమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దర్శించుకున్నారు. ఆషాఢ సారె సమర్పణ రెండవ రోజైన గురువారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన దేవదాయ శాఖ కమిషనర్ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణకు రాగా,వీరిని ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని,లడ్డు ప్రసాదాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కుటుంబం



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-శ్రీ కనకదుర్గమ్మ వారిని గురువారం ఉదయం ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆషాఢ సారె సమర్పణకు విచ్చేసిన కలెక్టర్ దంపతులను దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), ఈవో వికె శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతించి, అమ్మవారి దర్శనం చేయించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న హీరో అల్లరి నరేష్



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-కనకదుర్గ చిత్రం నాలుగు రోజులు షూటింగ్ నిమిత్తం విచ్చేసిన హీరో అల్లరి నరేష్ గురువారం శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకోవడానికి ఆలయానికి విచ్చేయగా సంబంధిత ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు.వేద పండితులు వేదాశీర్వాదాన్ని అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పరామర్శల వెల్లువ



ఏలూరు, నేటి శుభోదయ ::: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఏలూరు పార్లమెంట్ కి చెందిన పలువురు నేతలు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీ నాయనమ్మ పుట్టా పోలమ్మ గత శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు గురువారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను కలిసి పరామర్శించారు. పోలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించి, సంతాపం తెలిపారు. ఈ సమయంలో ఎంపీ, ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండి, ఈ బాధ నుంచి త్వరగా కోలుకోవాలని నేతలు ఆకాంక్షించారు. తనను పరామర్శించడానికి వచ్చిన నేతలు, పార్టీ కార్యకర్తలందరినీ పేరు పేరునా పలకరించిన ఎంపీ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ ని కలిసినవారిలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత ముత్తారెడ్డి, మధుబాబు, బొమ్మాజీ అనిల్, జంగారెడ్డిగూడెం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, రూరల్ అధ్యక్షుడు మాధవరావు దాకరపు కృష్ణ, రావూరి కృష్ణ, దెందులూరు నియోజకవర్గానికి చెందిన మిల్లు బాబు, ఇతర నేతలు, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలావేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి తరలి వస్తున్న భక్తులు



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-ఆషాఢ సారె రెండవ రోజు గురువారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విపరీతంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 18 సారె బృందాలు, 7,940 మంది భక్తులు తరలి వచ్చారు. దేవస్థానం వారు భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ (100/- దర్శనం లైన్ ) మొత్తం సారె భక్తులకు కేటాయించారు. దర్శనం క్యూ లైన్లు, మౌలిక సదుపాయాలు, ఉచిత ప్రసాదం పంపిణీ లను ఈవో వికె శీనానాయక్ పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో మంచినీటి సరఫరా, మౌలిక సదుపాయాలను దేవస్థానం వారు ఏర్పాటు చేశారు.

## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన డ్రెయిన్లలో ప్రత్యేక శుభ్రత



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):- వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన డ్రైన్లలో ప్రత్యేక శుభ్రతను చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం నైజాం గేట్, వన్‌టౌన్‌లోని మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను లాంగ్ ఆర్మ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని ప్రధాన డ్రెయిన్లు, కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగిస్తున్నట్లు తెలిపారు. డ్రెయిన్లలో చెత్త పేరుకుపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గృహ వ్యర్థాలు, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలను డ్రెయిన్లు, కాలువల్లో వేయకుండా నగర పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం శాకాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇప్పటికే పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో డిజిటలైజ్ చేసి, ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా డేటా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. డిజిటలైజేషన్‌లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ, వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫారాలు అందజేయని ఓటర్లను మరోసారి సంప్రదించి, అర్హులైన ప్రతి ఓటరి వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసి పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా పాటిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## విజయవాడలో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర.

**పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు**




విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):- భవానీపురంలోని సితార గ్రౌండ్స్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జగన్నాథ స్వామివారి దర్శనం చేసుకుంటారు. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించి, వేదమంత్రాలు, భజనలు, హరినామ సంకీర్తనల మధ్య సితార గ్రౌండ్స్ నుంచి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొని శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగి, రథయాత్రలో పాల్గొని భక్తులతో కలిసి హరినామ సంకీర్తనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ జగన్నాథ రథయాత్ర భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వైభవానికి ప్రతీక అని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి, సామరస్యం, సద్భావనలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొని రథయాత్రను విజయవంతం చేశారు. భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు.

## ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలతో మైలవరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆత్మీయ సమావేశం



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-ఎన్టీఆర్ జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ-- అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం గురువారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో జరిగింది. ప్రతినెలా ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఒక కార్యాలయంలో జిల్లా టీడీపీ సమావేశం నిర్వహిస్తారు. ఈ నెల మైలవరం నియోజకవర్గంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గద్దె అనురాధ, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ సంస్థాగత బలోపేతం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు మరింత చురుకుగా వ్యవహరించాలని, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేర్చేలా కృషి చేయాలని సమావేశంలో మాట్లాడుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే దిశగా అందరూ సమిష్టిగా పనిచేయాలని నాయకులు నిర్ణయించారు. సమావేశం అనంతరం నాయకులు పరస్పరం పలకరించుకొని జిల్లాలో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణపై చర్చించారు.

## విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాను కాపాడుతున్నాం. ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా మరో సారి రుజువు అయ్యిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎగతాళి చేశారని, ఇప్పుడు ఆ పట్టిసీమ ద్వారానే కృష్ణా డెల్టాకు నీరు అందిస్తున్నారన్నారు. గురువారం ఉదయం తూర్పు లోని 17వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడి వారిని అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో స్వయం ఉపాధి చేసుకునేందుకు చిత్ర అనే మహిళకు 30 వేలు విలువ చేసే బడ్డీకొట్టును ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసి ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా టి.డి.పి అధ్యక్షురాలు గద్దె అనురాధ బడ్డీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును వట్టిసీమ, తొట్టి సీమ అని ఎగతాళి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు గుండెలపై చేయి వేసుకుని ఆలోచించాలన్నారు. పట్టిసీమ ప్రాజెక్టుకు రూ.13 వందల కోట్లు ఖర్చు చేస్తే ఇప్పటి వరకు 50 వేల కోట్లు లాభం చేకూర్చిందన్నారు. ఎల్నినో ప్రభావంతో ఎండలు ఎక్కువుగా ఉంటాయని వాతావరణ పరిశోధకులు చెబుతున్నారని, అందువల్ల పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు నీరు అందిస్తున్నారని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టును చూసిన తర్వాతైనా వైఎస్సార్‌సీపీ నాయకుల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఒకసారి మూడు రాజధానులని, మరోసారి మావిగన్ అని అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు మాటలు మారుస్తూ, అమరావతిపై విషం చిమ్ముతూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని నాయకులు అందరూ కలిసి మెలిసి ఉంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,రాయి రంగమ్మ, కొక్కిరి తిరుపతయ్య, వేముల దుర్గారావు, పెద్ది అన్నారావు, గల్లా శ్రీను, మైలమూరి పీరుబాబు, మునికృష్ణ, తోట శ్రీను, కొప్పుల శ్రీనివాస్, మొకర ఆదిబాబు, రాయవరపు అశోక్, నడికుప్పల రవి, లక్ష్మి, గోగుల ఏసు, భద్ర, గోగుల గోపి, భాష తదితరులు పాల్గొన్నారు.


## 13 మంది లబ్ధిదారులకు 8 లక్షల సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం 58వ డివిజన్‌కు చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం 8 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఎమ్మెల్యే కార్యాలయానికి స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్లు లేదా ప్రజలు వచ్చినా వారి సమస్యలను తెలుసుకుని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తున్నామని, సీఎం రిలీఫ్ నిధి ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఉమా తెలిపారు, అనంతరం మంజూరైన చెక్కులను డివిజన్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు గౌరవప్రదంగా అందజేస్తున్నామని,ఇప్పటివరకు కూటమి ప్రభుత్వ హయాంలోని 24 నెలల్లో సుమారు 12 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధిని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు అందించినట్లు, గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన 5 సంవత్సరాల కాలంలో కూడా సుమారు 30 కోట్ల సీఎం రిలీఫ్ నిధిని ప్రజలకు అందించి రాష్ట్రంలోనే అత్యధికంగా సహాయం అందించిన ఎమ్మెల్యేగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఐదు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి గురించి ప్రజలకు పెద్దగా అవగాహన లేకపోయినా, ప్రస్తుతం ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రతిరోజూ సీఎం రిలీఫ్ కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక సిబ్బందిని నియమించి, ప్రతిరోజూ సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులను నిరంతరం ఫాలోఅప్ చేయడం వల్ల పెద్ద ఎత్తున సీఎం రిలీఫ్ చెక్కులు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత కష్టపడి పనిచేస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఉమా స్పష్టం చేశారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి..!!

**- మల్కాపురం సీఐ నరసింహారావు**



( నేటి శుభోదయ జులై : 17 విశాఖపట్నం జిల్లా : చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం విద్యార్థుల విద్యాభివృద్ధికి పోలీసు శాఖ తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు ముందుకు వచ్చారు,ఈ సందర్భంగా మల్కాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సుమారు రూ.10 వేల విలువైన జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించిన ప్రవేశ పుస్తకాలను విరాళంగా గురువారం అందజేసి,

విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉన్నత విద్యా అవకాశాలను సాధించాలని సీఐ ఆకాంక్షించారు, ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మాదకద్రవ్యాల నిరోధం, మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు,విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే పుస్తకాలను అందజేసిన మల్కాపురం పోలీస్ అధికారులకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.


## ఆర్ టీ సీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు. ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 16 (నేటి శుభోదయ):అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆర్ టీ సీ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (=జ జీూజ) నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ, ఆర్ టీ సీ ఉద్యోగ సంఘాల జెఏసి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన న్యాయమైన డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యుత్ వాహనాల (జు౨) విధానాన్ని అనుసరించడం అవసరమేనని, అయితే కొత్తగా ప్రవేశపెట్టే ఆర్ టీ సీ ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆర్ టీ సీ డ్రైవర్లు, కండక్టర్లనే కొనసాగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనుభవజ్ఞులైన ఆర్ టీ సీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారి సేవలను కొనసాగించడం వల్ల ఉద్యోగులకు భరోసా కలగడంతో పాటు ప్రయాణికుల భద్రత కూడా మరింత మెరుగుపడుతుందని ఉమా పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ఉద్యోగులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్ టీ సీ ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని, ఉద్యోగుల భద్రతకు భరోసా కల్పించే అంశాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామని బొండా ఉమా హామీ ఇచ్చారు. ఎప్పటిలాగే విద్యుత్ బస్సుల నిర్వహణలో ఆర్ టీ సీ ఉద్యోగుల సేవలు కొనసాగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఉమా తెలిపారు.

## వర్షపు నీటి సంరక్షణ చేపట్టాలి

**- భూగర్భ జలం మట్టం పెంచాలి - నీటి అదా చేద్దాం భావితరాలకు భద్రత కల్పిద్దాం - ప్రతి పౌరుడు నీటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలి**




వైరా, నేటి శుభోదయ ::: వైరా కూరగాయల మార్కెట్ వద్ద "జల్ సంచయ్ జన్ భాగిధారి" (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ మేడూరి రామచంద్ర రావు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి. వెంకట్రావు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జే.ఎస్.జే.బి) 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిపౌరుడు తనవంతు బాధ్యతగా పాల్గొనవలసిందిగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, స్వచ్ఛందసంస్థలు మరియు యువత అందరూ ఈకార్యక్రమంలో చురుకుగా పాల్గొని వర్షపు నీటిసంరక్షణ చర్యలను చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటుచేయాలని,నీటివృథాను నివారించాలని, భూగర్భజలాలను పెంపొందించాలని, చెరువులు పరిరక్షించాలని, ప్రతిఇంటిలో వర్షపు నీటిసంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది. ప్రతి ఇంటివద్ద వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుటకు, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు మనమందరంతోడ్పడవచ్చు. నీటి ప్రతిబొట్టుఅమూల్యమైనది. భవిష్యత్తరాలకు నీటిభద్రతను కల్పించాలంటే ప్రతిపౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటిసంరక్షణలో భాగస్వామి కావాలి. ప్రజల సహకారంతోనే ఈకార్యక్రమంవిజయవంతమవుతుందని, అందరూస్వచ్ఛందంగా పాల్గొని "జల్ సంచయ్ జన్ భాగిధారి"కార్యక్రమాన్నివిజయవంతంచేయాలనివిజ్ఞప్తిచేయడమైనది. ఈప్రజాఉద్యమాన్నివిజయవంతంచేయడానికి వైరా మున్సిపాలి టీతోకలిసి ప్రతిపౌరుడు స్వచ్ఛందంగా పాల్గొని నీటిసంరక్షణకు కట్టుబడి ముందుకు రావలసిందిగా మున్సిపల్కమీషనర్ విజ్ఞప్తిచేసారు చేజహీరాబాద్నీటిని ఆదా చేద్దాం భావితరాలకు భద్రతకల్పిద్దాం. "మున్సిపల్ కమీషనర్ తెలిపారు.

## యస్.బి.ఐ.టి. లో ప్రారంభమైన రెండు రోజుల హ్యాకథాన్ 2026



ఖమ్మం, నేటి శుభోదయ ::: విద్యార్థులలోని ఆలోచనలను పదును పెట్టే ఉద్దేశ్యంతో "హ్యాకథాన్ 2026" పేరుతో యస్.బి.ఐ.టి. కళాశాల ప్రాంగణంలో నిర్వహించే రెండు రోజుల హ్యాకథాన్ గురువారం ప్రారంభమైందని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కొత్త విషయాలను ఆలోచించడం సృజనాత్మకత అవుతుందని, కొత్త విషయాలకు రూపాన్ని ఇవ్వడం ఆవిష్కరణ అవుతుందని కృష్ణ అభిప్రాయపడ్డారు. ఆధునిక సమాజంలో విద్యార్థులకు సృజనాత్మకత లేనిదే మనుగడ కష్టమని తెలియజేసారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హ్యాకథాన్‌లో భాగంగా 250 మంది విద్యార్థులు పాల్గొని కోడ్‌స్యాండ్ బాక్స్, ఏ.ఐ. సోర్‌క్యాటిక్ ట్యూటర్, ఐ.పి.యల్ టికెటింగ్ వంటి థీమ్స్ పై విద్యార్థులకు 48 గంటల పరిశోధనాత్మక, కోడింగ్ వివరణతో అందించేలా సూచించామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. రెండు రోజుల అనంతరం విజేతలను ఎంపిక చేయనున్నట్లు, గెలుపొందిన విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందించనునట్లు కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. నూతన ఆవిష్కరణలకు సృజనాత్మకత మూలం అని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. థీమ్స్‌కు అనుగుణంగా ఏ.ఐ.ను ఉపయోగిస్తూ ట్యూటర్ విధులను నిర్వర్తించే అప్లికేషన్ తయారీ, ఏ కంప్యూటర్ భాషనైనా ఎక్కడినుండైన అమలు పరిచే అప్లికేషన్ తయారీ, ఐ.పి.ఎల్., క్రీడకు అనుగుణంగా పూర్తి అప్లికేషన్‌ను ఫుల్‌స్టాక్ లో నిర్వహించటం వంటి సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనడం ముఖ్య ఉద్దేశాలుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లారిటిఎడ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సి.ఈ.ఓ. తాళ్ళూరి రాజీవ్ చంద్ర తో పాటు కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ సెల్ ఇనఛార్జ్ డా॥ మురళీ మోహన్, పి. అశ్విని, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, విభాగాధిపతులు డా॥ సుప్రియ, డా॥ స్ఫూర్తి, డా॥ పద్మావతి, డా॥ జి. ప్రభాకర్, టి.పి.ఒ. యన్. సవిత తదితరులు పాల్గొన్నారు.

## 45వ నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**ఉత్తమ పనితీరు కనబరిచిన డీసీసీబీగా గుర్తింపు**



హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ ::: గ్రామీణ రుణాల పంపిణీ, సహకార పాలన, మరియు ఆర్థిక సమగ్రత రంగాల్లో విశిష్ట సేవలను అందించినందుకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖమ్మం (డీసీసీబీ) రాష్ట్రంలో "ఉత్తమ పనితీరు కనబరిచిన డీసీసీబీ"గా ఎంపికైనట్లు తెలియజేయడానికి మాకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రతిష్మాత్మక పురస్కారం 45వ నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం 16 జూలై 2026 నాబార్డ్ రీజనల్ ఆఫీస్ హైదరాబాద్ నందు ఎం దాన కిషోర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్, నాబార్డ్ హైదరాబాద్ సిజిఎం బి ఉదయభాస్కర్ ల చేతుల మీదుగా అందుకోవడం జరిగింది . ఈ గౌరవం మా బ్యాంకు పాలక మండలి, అధికారులు, ఉద్యోగులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మరియు అన్ని భాగస్వాముల సమిష్టి కృషి, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం.

## జర్నలిస్టుల సంక్షేమమే 'జాప్' ధ్యేయం..

**ఇళ్ల స్థలాలు, విద్యా రాయితీలు, న్యాయ రక్షణే లక్ష్యంగా ఉద్యమిస్తాం**

**: రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి**



అనంతపురం జులై 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బందారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) నిరంతరం కట్టుబడి ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్), ఎన్.యు.జె.ఐ అనుబంధ అనంతపురం జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర యాదవ్, కార్యదర్శి జోగిరెడ్డి సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా మాట్లాడారు. జాప్ యూనియన్‌లో సభ్యత్వం పొందిన ప్రతి జర్నలిస్టుకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే తమ ప్రధాన ఎజెండా అని ఆయన వెల్లడించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించే విషయమై త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకొచ్చి ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఒకవేళ అధికారులు దీనిపై సానుకూలంగా స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులపై అక్రమంగా, తప్పుడు కేసులు నమోదు కాకుండా యూనియన్ రక్షణ కవచంలా నిలుస్తుందని రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో ఉన్న విలేకరులకు ఏదైనా కేసు లేదా ఇతర వేధింపుల వంటి సమస్యలు ఎదురైతే, వెంటనే ఆ విషయాన్ని జిల్లా సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. తద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడి, బాధ్యులైన వారి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు తక్షణ న్యాయం జరిగేలా చొరవ చూపుతామన్నారు. దీంతో పాటు, జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు యూనియన్ తరఫున కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గుర్తింపు కార్డులు లేని జర్నలిస్టుల పిల్లలకు సైతం ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థల్లో యాభై శాతం ఫీజు రాయితీ లభించేలా యాజమాన్యాలతో మాట్లాడి తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న జాప్ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి సభ్యునిపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల ప్రతినిధులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుడివాడలోని భీమవరం రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత.

**–గుడివాడ మరియు పరిసర ప్రాంత ప్రజలకు గుడివాడ ట్రాఫిక్ పోలీస్ విజ్ఞప్తి**

గుడివాడ, జులై 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈనెల 24 తేదీ నుండి 28వ తేదీ వరకు గుడివాడ లోని భీమవరం రైల్వే గేట్ మరమ్మత్తుల నిమిత్తం తాత్కాలికంగా మూసివేయడం జరుగుతుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గుడివాడ పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున గుడివాడ, పరిసర ప్రాంతాల వాహనదారుల రాకపోకలను ప్రత్యామ్నాయ దారులలో వెళ్ళవలని అన్నారు. మచిలీపట్నం, పామర్రు నుండి భీమవరం మరియు హనుమాన్ జంక్షన్ వైపు వెళ్ళు భారీ వాహనాలు పై తేదీలలో గుడివాడ నుండి వెళ్లకుండా (వయా గుడ్లవల్లేరు) ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని కోరారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## గుడివాడలోని నలంద రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత.

–గుడివాడ, పరిసర ప్రాంత ప్రజలకు గుడివాడ ట్రాఫిక్ పోలీస్ విజ్ఞప్తి

గుడివాడ, జులై 16 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈనెల 17 తేదీ నుండి 19తేదీ వ వరకు గుడివాడ లోని నలంద రైల్వే గేట్ మరమ్మత్తుల నిమిత్తంలి తాత్కాలికంగా మూసి వేయబడుతుంది మరియు గుడివాడ పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున గుడివాడ మరియు పరిసర ప్రాంతాల వాహనదారులు మీ యొక్క రాకపోకలను ప్రత్యామ్నాయ దారులలో వెళ్ళవలసిందిగా తెలపడం అయినది. మచిలీపట్నం, పామర్రు నుండి భీమవరం మరియు హనుమాన్ జంక్షన్ వైపు వెళ్ళు భారీ వాహనాలు పై తేదీలలో గుడివాడ నుండి వెళ్లకుండా (వయా గుడ్లవల్లేరు) ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లవలసిందిగా తెలపడం అయినది. గుడివాడ టౌన్ నుండి మచిలీపట్నం, పామర్రు వెళ్ళవలసిన కార్లు , వాన్ లు ,ఆటో లు ,బస్ స్టాండ్ ,కోతి బొమ్మ సెంటర్ , ముబారక్ సెంటర్, చాపల మార్కెట్ ,పంచవటి కాలనీ,బాపినీడు పెట్రోల్ బంక్ ,భీమవరం గేట్ మీదు గా వెళ్ళవలసినదిగా తెలపడం అయినదికావున వాహనదారులు సహకరించగలరు.

## విధులకు వెళ్లేటప్పుడు రైలు ప్రమాదం లో మరణించిన హోమ్ గార్డ్..!!

**– సీపీ చేతుల మీదుగా చెక్కు పంపిణీ**




( నేటి శుభోదయ జులై :17 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ సిటీ హోమ్ గార్డ్ యూనిట్ నందు పనిచేస్తూ గత సంవత్సరం తేదీ 25.11.2025 న, హెచ్ జి -315 బడియా కృష్ణారావు విధులకు వెళ్లేటప్పుడు రైలు ప్రమాదం లో మరణించినారు. పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్.చేతుల మీదుగా న్యూ ఇండియా ఇన్సూరెన్స్ వారి చెక్ రూ. 10,11,600.00/- ను బడియా కృష్ణారావు భార్య బడియా గౌరీ అందజేయడం అయినది.ఈ యొక్క కార్యక్రమమునకు న్యూ ఇండియా ఎస్యురెన్స్ కంపెనీ సిబ్బంది మరియు ఆర్. ఐ. హోంగార్డ్స్ శ్రీ సి.హెచ్. కోటేశ్వర కుమార్ పాల్గొన్నారు.

## పర్యాటకులతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు..!!

**– భీమిలి సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరిక**



( నేటి శుభోదయ జులై : 17 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) భీమిలి బీచ్‌కు వచ్చే పర్యాటకుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, ఫొటోల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని భీమిలి సీఐ దివాకర్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన బీచ్ ఫొటోగ్రాఫర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అందమైన భీమిలి తీరానికి వచ్చే సందర్శకులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. కొందరు ఫొటోగ్రాఫర్ల ప్రవర్తన వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు జారీ చేశారు.పోలీస్ నిబంధనలు ఇవే:బీచ్‌కు వచ్చే ఫ్యామిలీలు, టూరిస్టులతో అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి ?పోలీసు నిబంధనలను ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.నిబంధనలు అతిక్రమించి పర్యాటకులను అసౌకర్యానికి గురిచేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.నిబంధనలు మీరిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరించారు.

## తగరపువలస ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన..!!

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్సై తిరుపతి రావు**

**స్కూల్ ఆటోలు నడిపే డ్రైవర్లు జాగ్రత్తగా మెలగాలి**

**– ఆటోలు సామర్థ్యం మించి ఉంటే చర్యలు తప్పవు**




( నేటి శుభోదయ జులై : 17 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విద్యార్థుల భద్రతతో పాటు ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా తగరపువలసలో గురువారం నార్త్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. ఉమాకాంత్, భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భీమిలి, తగరపువలస ప్రాంతాలకు చెందిన ఆటో స్టాండ్ల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, ముఖ్యంగా స్కూల్ ఆటోలను నడిపే డ్రైవర్లు విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.స్కూల్ ఆటోల్లో నిర్ణీత సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అలాగే ఆటోల్లో సైడ్ సిట్టింగ్‌కు అవకాశం ఇవ్వకూడదని, హైబీమ్ లైట్లను అనవసరంగా వినియోగించరాదని, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి డ్రైవర్ బాధ్యతగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.విద్యార్థుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే డ్రైవర్లపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని పేర్కొంటూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడిపితేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.

## తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

## : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**– ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలు తప్పనిసరిగా నిర్వహించాలి**

**– అమృత్ పథకం తాగునీటి పనులను గడువులోగా పూర్తి చేయాలి**

**– వీబీజీఆర్ఏఎంజీ పథకంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**– సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలి**

**– సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి**

**– త్రాగునీరు, సీజనల్ వ్యాధులు, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్**



ఖమ్మం ,నేటి శుభోదయ ::: తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గురువారం త్రాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి త్రాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పడే ప్రతి నీటి బొట్టును సంరక్షించేలా, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు స్థానిక సంస్థలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో డ్రైడే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రజల్లో "నీటిని నిల్వ ఉంచవద్దు" అనే అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. దోమల నివారణ చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాంలలో ఒక జతను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా పంపిణీ చేసేలా జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.



## రేపే 'చింతల కోమలి' ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు..

**చింతల వీర్రాజు 11వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); కోరుకొండ మండలం బూరుగుపూడి రామాలయం సెంటర్ వద్ద శనివారం ఉదయం 9 గంటలకు చింతల కోమలి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా కోమలి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తన మామయ్య స్వర్గీయ చింతల వీర్రాజు పదకొండో వర్ధంతి సందర్భంగా శనివారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 20 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు మరియు మున్సిపల్ సిబ్బందికి వస్త్రాలు బహూకరణ చేపడుతున్నట్లు ఆమె తెలియజేశారు. రామాలయం సెంటర్ వద్ద జరిగే మెడికల్ క్యాంపునకు గ్రామ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేసారు.

## "ముద్రగడ పద్మనాభంకుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కొట్టు"



తాడేపల్లిగూడెం జులై 16 (అవినాష్ మారంపూడి నేటి– శుభోదయ)::: మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కిర్లంపూడి లో ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రగడ మరణం వైసీపీకి, రాష్ట్రానికి తీరని లోటు అని ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కాపుల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేశారని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ప్రజలకు సేవ చేశారని ఆయన మరణం ఎవరో తీర్చలేరని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కర్రీ భాస్కరరావు, బండారు నాగు, గాజులు గోపీకృష్ణ (అడ్వకేట్), గారపాటి వీర కుమార్, పెంట కిరణ్, మానికొండ వెంకటేశ్వరరావు, సుచిత్ర రెడ్డి, సిర్రపు శాంత కుమార్, ఎస్ ఎస్ రాజా, కడియం మాజీ సర్పంచ్ బూరయ్య, షేక్ మస్తాన్ తదితరులు ఉన్నారు.

## అనకాపల్లి జిల్లా పోలీసుల భారీ ఆపరేషన్

## రూ. 1.1 కోట్ల విలువైన 220 కిలోల గంజాయి స్వాధీనం..!!

**-- ముగ్గురు నిందితుల అరెస్ట్**




( నేటి శుభోదయ జులై : 17 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) అనకాపల్లి పట్టణం (రావికమతం), అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ మరియు అనకాపల్లి సబ్ డివిజన్ ఇంచార్జి డీఎస్పీ శ్రీ జి.ఆర్.ఆర్.మోహన్ ఆదేశాల మేరకు, కొత్తకోట సిఐ జీ.కోటేశ్వరరావు పర్యవేక్షణలో రావికమతం పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. నమ్మదగిన సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడిలో రావికమతం పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాకు ఉపయోగించిన రెండు లగ్జరీ కార్లను సీజ్ చేశారు. కేసు వివరాలు అండ్ గంజాయి పట్టివేత: రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో తేది.15.07.2026 మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో ఎస్సై ఎం.రఘువర్మ తన సిబ్బందితో కలిసి రావికమతం--అనకాపల్లి రహదారిలోని గుడివాడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా వచ్చిన రెండు కార్లను అడ్డగించి తనిఖీ చేయగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 220 కిలోల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ.1.1 కోట్లు ఉంటుందని అంచనా.సీజ్ చేసిన వాహనాలు:మారుతి ఎర్టిగా (మారుతి ఎర్టిగా ) -- రిజిస్ట్రేషన్ నెం: ఏపీ 40 జేపీ 6216 టాటా కర్వ్ (టాటా కరవ్ ) -- రిజిస్ట్రేషన్ నెం: ఏపీ 40 ఎల్ ఎం 1517 అదుపులోకి తీసుకున్న నిందితులు (అరెస్ట్):కిల్లో తిమోతి (ఏ 1) (వయస్సు 26) -- తండ్రి: రాజయ్య, నివాసం: గౌడుపుట్టు గ్రామం, ఇంజరి పంచాయతీ, పెదబయలు మండలం, అల్లూరి సీతారామరాజు (ఏ ఎస్ ఆర్ ) జిల్లా (గంజాయి సప్లయర్).

షేక్ మహమ్మద్ రఫీ (ఏ 2) (వయస్సు 26) -- తండ్రి: షేక్ మహబూబ్ షరీఫ్, నివాసం: సత్తెనపల్లి, పల్నాడు జిల్లా (గంజాయి కొనుగోలుదారుడు).షేక్ ఫయాజ్ (ఎ3) (వయస్సు 19) -- తండ్రి: షేక్ అల్లాబక్ష్, నివాసం: సత్తెనపల్లి, పల్నాడు జిల్లా (కారు డ్రైవర్ - ఏపీ 40 ఎల్ ఎం 1517).పోలీసుల తనిఖీ సమయంలో కార్లలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు, అలాగే మోటార్ సైకిల్‌పై ముందుండి పైలటింగ్ (దారి చూపుతూ) చేస్తున్న మరో ఇద్దరు నిందితులు పోలీసులను చూసి ఘటనా స్థలం నుండి పరారయ్యారు.

నేరానికి సంబంధించిన విచారణా వివరాలు: పరిచయం -- ప్రణాళిక:కొన్ని రోజుల క్రితం ఏఎస్సార్ జిల్లా పెదబయలు మండలంలోని తారాబు జలపాతం వద్ద ఏ 2 షేక్ మహమ్మద్ రఫీకి, స్థానిక గంజాయి వ్యాపారి ఏ 1 కిల్లో తిమోతితో పరిచయం ఏర్పడింది. లాభాల్లో వాటా పంచుకునే ఒప్పందంతో గంజాయిని సరఫరా చేస్తానని తిమోతి హామీ ఇచ్చాడు.



మొదటి విడత రవాణా: సుమారు నెల రోజుల క్రితం, ఏ 2 మహమ్మద్ రఫీ రెండు కార్లలో వెళ్లి ఏ 1 తిమోతి వద్ద 50 కిలోల గంజాయిని కొనుగోలు చేసి సత్తెనపల్లికి తరలించాడు. అక్కడ రెండు రోజులు నిల్వ ఉంచి, అనంతరం తమిళనాడులోని హోసూర్‌కు చెందిన సౌందర్ అనే వ్యక్తికి విక్రయించాడు.ప్రస్తుత ముఠా ఆపరేషన్:తేది 14.07.2026 న ఏ 2 రఫీ తన అనుచరులతో కలిసి రెండు కార్లు, ఒక బైక్‌పై వెళ్లి ఏ 1 తిమోతి వద్ద 220 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. ఇందుకు గాను రూ.1.50 లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించి, మిగిలిన మొత్తాన్ని తమిళనాడులో సౌందర్‌కు విక్రయించిన తర్వాత చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు.

రూట్ మ్యాప్ అండ్ ఎస్కాట్:పోలీసుల కన్నుగప్పేందుకు ఏ 1 కిల్లో తిమోతి స్వయంగా తన సహచరులతో కలిసి పాడేరు 12వ మైలురాయి నుండి చీడికాడ మీదుగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఈ గంజాయి వాహనాలకు ఎస్కార్ట్ (పైలటింగ్) ఇచ్చి తీసుకువస్తుండగా గుడివాడ జంక్షన్ వద్ద రావికమతం పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుకున్నారు.పోలీసుల తదుపరి చర్యలు -- డీఎస్పీ గారి ప్రశంసలు: ఈ కేసులో రావికమతం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం: 52/2026, యూ /ఎస్ 20(బి ), 25 ఆర్ / డబ్ల్యు 8(సీ ) న్ డీ పీ ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరిగింది. ప్రస్తుతం పరారీలో ఉన్న ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఇద్దరు నిందితులు, సత్తెనపల్లికి చెందిన ముగ్గురు నిందితులు, అలాగే గంజాయి రిసీవర్ అయిన తమిళనాడు (హోసూర్)కు చెందిన సౌందర్ ను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించినట్లు అధికారులు తెలిపారు.?సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఇంతటి భారీ గంజాయి రవాణా ముఠాను పట్టుకున్న రావికమతం ఎస్సై ఎం.రఘువర్మ, బుచ్చయ్యపేట ఎస్సై పి.మనోజ్ కుమార్ మరియు పోలీసు సిబ్బందిని అనకాపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీ జి.ఆర్.ఆర్.మోహన్ గారు ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డులు అందించారు.

## మారక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి సి.ఐ ఎర్రం నాయుడు పిలుపు..!!




( నేటి శుభోదయ జులై : 17 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఆనందపురం మండలం బోని గ్రామంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం సిటీ పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ పై గ్రామస్థుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ వివిఎస్ఎం. ఎర్రం నాయుడు మాట్లాడుతూ గ్రామస్థులకు గంజాయి, మద్యం ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అలాగే సమాజానికి కలిగే తీవ్ర దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితులలో యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అలాగే గంజాయి, మాదక ద్రవ్యాల సాగు, రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. కళ్యాణి మాట్లాడుతూ ప్రజలు మత్తు మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్న విశాఖపట్నం సిటీ పోలీస్, ఈగిల్ బృందం చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## సువేందు అధికారిపై మమత న్యాయపోరాటం..

# భవానీపూర్ ఫలితంపై పిటిషన్

భవానీపూర్ ఎన్నికల ఫలితంపై హైకోర్టులో మమత పిటిషన్

సీఎం సువేందు అధికారి విజయాన్ని సవాల్ చేసిన దీదీ

15,015 ఓట్ల తేడాతో ఓటమిని ప్రశ్నించిన తృణమూల్ అధినేత్రి

కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని పిటిషన్‌లో ఆరోపణ

2021 నందిగ్రామ్ తర్వాత మళ్లీ సువేందుపై కోర్టుకెక్కిన మమత




పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి న్యాయపోరాటానికి దిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గ ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆమె మంగళవారం కలకత్తా హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధృవీకరించేందుకు మమత స్వయంగా హైకోర్టు రిజిస్ట్రీకి హాజరైనట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బీజేపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ 15,015 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఒకప్పుడు టీఎంసీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో ఓడిపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫలితాలపై న్యాయవిచారణ జరపాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించి, సువేందు అధికారి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, సువేందు అధికారిపై మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించడం ఇది రెండోసారి. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ నియోజకవర్గంలో సువేందు చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పుడు కూడా మమత హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. తాజా పరిణామంతో మమత, సువేందు మధ్య రాజకీయ వైరం మరింత తీవ్రస్థాయికి చేరింది. ఈ పిటిషన్‌పై బీజేపీ గానీ, సువేందు అధికారి గానీ తక్షణమే స్పందించలేదు.

# 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్: అనిత

ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత

గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ

ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి



అమరావతి: ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు. 'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ..

# 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!

సీఆర్ పాటిల్ తో పవన్ కల్యాణ్ భేటీ

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత తీరలేదని చెప్పిన పవన్

నదీ జలాల స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని 'సూరత్ నమూనా'ను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఏపీలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.


# అణ్వస్త్ర రాశులు!

దేశాల వద్ద పోగు పడ్డ అణుబాంబులు

ఇప్పటిదాకా 9 దేశాల వద్ద అణుపాటవం

5,459 అణు వార్‌హెడ్లతో టాప్‌లో రష్యా

అమెరికా వద్ద 5,277 అణ్వాయుధాలు




ఇరాన్‌తో అమెరికా అణు చర్చలు చెప్పుకోదగ్గ పురోగతి సాధిస్తున్నా లెక్కచేయకుండా అధ్యక్షుడు ట్రంప్ దానిపై ఉన్నట్టుండి యుద్ధానికి తెర తీశారు. ఆ దేశం ఎన్నటికీ అణ్వస్త్రాలను తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఉన్నపళంగా ఇరాన్‌పై అంత స్వేచ్ఛగా దాడికి దిగగలిగారంటే దానివద్ద అణు బాంబులు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగిన రష్యాపై మాత్రం ట్రంప్ ఎంతగా కత్తులు నూరినా, నాలుగేళ్లుగా కఠిన ఆంక్షలు తదితర చర్యలకే పరిమితమయ్యారే తప్ప ఎన్నడూ యుద్ధానికి దిగే సాహసం చేయలేదు. ఆ దేశం వద్ద అపారంగా పోగుపడ్డ అణ్వాయుధ నిల్వలే అందుకు ప్రధాన కారణమన్నది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో ప్రపంచంలో అణుపాటవమున్న దేశాలెన్ని, వాటి వద్ద ఎన్ని అణ్వాయుధాలున్నాయి అన్నది ఓసారి చూస్తే... అణ్వస్త్ర దేశాల జాబితాలో అగ్రాసనం అమెరికా, రష్యాలదే. ప్రపంచంలోని మొత్తం అణుబాంబుల్లో 90 శాతానికి పైగా ఈ రెండు దేశాల వద్దే పోగుపడ్డాయి! ఆ రెండింట్లో సంఖ్యాబలం రీత్యా రష్యాదే పైచేయి. అమెరికా వద్ద 5,277 అణు బాంబులుంటే రష్యా వద్ద ఏకంగా 5,459 దాకా పోగుపడ్డాయి! అమెరికా తన అణ్వాయుధాలను బెల్జియం, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, టర్కీల్లో కూడా మోహరించి ఉంచడం విశేషం! రష్యా కూడా తన అణ్వాస్త్రాల్లో కొన్నింటిని మిత్ర దేశం బెలారస్‌లో ఉంచింది. ఇతర అణ్వస్త్ర దేశాల్లో ఇజ్రాయెల్, ఉత్తర కొరియా వద్ద ఉన్న అణుబాంబుల సంఖ్యపై కచ్?చతమైన స్పష్టత లేదు. ఇజ్రాయెల్ వద్ద కనీసం 200 అణు బాంబుల తయారీకి అవసరమైన అన్ని వనరులూ ఉన్నట్టు చెబుతారు. ఆ దేశం ఇప్పటికే 90 అణు బాంబులను తయారు చేసిందని అంచనా. ఉత్తర కొరియా కూడా 50 అణు బాంబుల తయారీకి అవసరమైన యురేనియం తదితరాలను పలు మార్గాల సేకరించి ఉంచుకున్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు. అణు పాటవమున్న మొత్తం 9 దేశాల వద్దా కలిపి 12,341 అణు బాంబులున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆటమిక్ సైంటిస్ట్స్ 2025 నివేదిక చెబుతోంది. వాటిలో 9,600కు పైగా అణు వార్‌హెడ్‌లు ఏ క్షణంలోనైనా ప్రయోగించేందుకు సిద్ధంగా ఆయా దేశాల సైన్యం నియంత్రణలో ఉన్నట్టు సమాచారం. అయితే ప్రచ్ఛన్నయుద్ధ కాలంతో పోలిస్తే ఇది చాలా తక్కువే కావడం విశేషం. ఆ సమయంలో ప్రపంచ దేశాలన్నింటి దగ్గరా కలిపి ఏకంగా 70 వేల పై చిలుకు అణు వార్‌హెడ్‌లు పోగుపడ్డాయి!

**అణ్వస్త్రాలున్న దేశాలు**


| దేశం | అణ్వస్త్రాలు | అణుపరీక్షలు |
|---|---|---|
| రష్యా | 5,459 | 715 |
| అమెరికా | 5,277 | 1,030 |
| చైనా | 600 | 45 |
| ఫ్రాన్స్ | 290 | 210 |
| ఇంగ్లండ్ | 225 | 45 |
| భారత్ | 180 | 6 |
| పాకిస్తాన్ | 170 | 2 |
| ఇజ్రాయెల్ | 90 | 1 |
| ఉత్తర కొరియా | 50 | 6 |

# మార్క్ 48.. నిశ్శబ్ద మృత్యువు

శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధనౌకను జలసమాధి చేసింది ఈ టోర్పెడోనే

వందల కిలోల వార్‌హెడ్‌తో దాడిచేసే సామర్థ్యం

రెండో ప్రపంచయుద్ధం తర్వాత తొలిసారిగా ఉపయోగించిన అమెరికా



అమెరికా నావికాదళం అమ్ములపొదిలోని మరో సముద్రగర్భ అస్త్రం విశేషాలు తాజాగా ఇరాన్ యుద్ధనౌకపై దాడి ఘటనతో వెలుగులోకి వచ్చాయి. దాని పేరు మార్క్48. జలాంతర్గామి నుంచి ప్రయోగించి ఈ టోర్పెడోకు అమెరికా నావికాదళం 'మార్క్ 48'అనే పేరుపెట్టింది. ఇరాన్‌కు చెందిన 'ఐఆర్ఐఎస్ దేనా'యుద్ధనౌకను కూల్చడం ద్వారా రెండో ప్రపంచయుద్ధం తర్వాత తొలిసారిగా ఒక శత్రునౌకను టోర్పెడోతో జలసమాధి చేశామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించడంతో ఇప్పుడు మార్క్48పై చర్చ మొదలైంది.

### దశాబ్దాలుగా నిశ్శబ్ద సేవ..

అమెరికా నేవీ ఆధీనంలో సేవలందించే జలాంతర్గాముల్లో ప్రస్తుతం మార్క్ 48 టోర్పెడోలను ఉపయోగిస్తున్నారు. తొలిసారిగా 1972లో దీనిని తయారుచేశారు. తర్వాత పలుమార్లు నవీకరించారు. ఇప్పుడు మార్క్48 ఏడీక్యాప్(అడ్వాన్స్‌డ్ కేపబిలిటీ) వేరియంట్‌ను వాడుతున్నారు. ఇందులో ఆధునీకరించిన ఎలక్ట్రానిక్, గైడెడ్, ప్రొపల్షన్ వ్యవస్థలు ఉన్నాయి. ఒక్కో టోర్పెడో 21 అడుగుల చుట్టుకొలతతో 19 అడుగుల పొడవు ఉంటుంది. దీని బరువు ఏకంగా 1,700 కేజీలు. యాక్టివ్, పాసివ్ సోనార్‌లతో ఇది పనిచేస్తుంది. ఆగి ఉన్న యుద్ధనౌకతోపాటు వేగంగా వెళ్తున్న యుద్ధనౌకలను ఇది లక్ష్యంగా చేసుకుని గురిచూసి పేల్చేయగలదు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఎలాంటి శబ్దం లేకుండా దూసుకెళ్లడం దీని ప్రత్యేకత. ఒక్కో టోర్పెడో తయారీకి రూ. 38.48 కోట్లు ఖర్చవుతుంది. శత్రువుల నౌకలను ఎదురుగా 'హల్'భాగాన్ని ఢీకొట్టకుండా అడుగు భాగానికి వెళ్లి ఢీకొట్టి పేలిపోతుంది. దీంతో నౌకఅడుగుకు భారీ రంధ్రం పడుతుంది లేదా ముక్కలు చెక్కలు అవుతుంది. దీంతో నౌక వేగంగా సముద్రజలాల్లో మునిగిపోతుంది. భారీ మందుగుండు పేలడంతో నౌక అడుగున ఒక పెద్ద గాలిబుడగ ఏర్పడుతుంది. దీంతో నౌక మరింత వేగంగా మునిగిపోతుంది. ఒకవేళ పాక్షికంగా దెబ్బతిన్నా కీలక వ్యవస్థలు విఫలంకావడంతో ఎదురుదాడి చేయలేక చేతులెత్తేస్తుంది.. గైడెన్స్ వైర్‌తో ఇది అనుసంధానమై ముందుకు దూసుకుపోతుంది. ఒకవేళ వైర్ తెగిపోయినా ఆటోమోడ్‌లో పనిచేస్తూ పని చక్కబెడుతుంది. డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్, అల్గారిథమ్‌లతో ఇది పనిచేస్తుంది. అత్యంత లోతైన, సంక్లిష్టమైన సముద్ర జలాల్లోనూ ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది అమెరికా నావికాదళంలోని లాస్ ఏంజెలెస్, సీఉల్ఫ్, ఒహాయో, వర్జీనియా తరగతి బాలిస్టిక్ మిస్సైల్ జలాంతర్గాముల్లోనూ ఈ టోర్పెడోలను అమర్చారు యుద్ధనౌకలతోపాటు శత్రుదేశ జలాంతర్గాములను వెంటాడి దాడిచేయగలదు 'శ్రీలంక సమీప సముద్రజలాల్లో ఉన్న ఇరాన్ యుద్ధనౌకపైకి కేవలం ఒక్క టోర్పెడోనే ప్రయోగించాం. భారీ యుద్ధనౌకను జలసమాధి చేయడానికి ఇలాంటి నిశ్శబ్ద మృత్యువు ఇదొక్కటి చాలు"అని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డేన్ కెయిన్ వ్యాఖ్యానించారంటే దీని సామర్థ్యం ఏమిటో ఇట్టే తెల్సిపోతుంది ముఖ్యంగా అణుఇంధనంతో నడిచే జలాంతర్గాములను నాశనం చేసేందుకు ఈ టోర్పెడోను డిజైన్‌చేశారు. సోవియట్ రష్యా సాంకేతికతకు దీటుగా ఎంకే37, ఎంకే14, ఎంకే16 టోర్పెడోలను రిప్లేస్ చేస్తూ 'ప్రాజెక్ట్ నోబాస్కా'లో భాగంగా దీనిని రూపొందించారు.


# వేదకాలం నుంచి నేటి కాలం వరకు.. విదుషీమణులు

ప్రాచీన కాలంలో, అంటే క్రీ.పూ.3000 సంవత్సరాల ముందు కాలం నుండీ కూడా మన దేశం 'స్త్రీ విద్య' ను ప్రోత్సహించి, గౌరవించింది. ఆనాటి నుండీ స్త్రీలు లౌకిక, అలౌకిక విద్యలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. వేదకాలంలోనే మహిళలు ఉపనయన సంస్కారాలు పొంది, వేదాధ్యయనం చేశారు. వేద మంత్రాలు దర్శించారు. తపస్వినులు, ఆధ్యాత్మికవేత్తలైన స్త్రీలను 'ఋషికలు' అంటారు. రోమశ, గార్గి వాచక్నవి, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, మైత్రేయి, అపాల, యామి, పౌలోమి, ఘోష, ఖోన, జుహు, వాగంభ్రణి, సావిత్రి, దేవజామి, కక్షివతి, దక్షిణ ప్రజాపత్య, విశ్వావతి, పశుక్రపత్ని, దేవసూని, శాశ్వతి, అంగీరసి, శ్రీ లక్ష్మి, నోధ, శిఖతన్వరి, గౌపాయన, ఉభయభారతి, విజ్జిక, కామాక్షి వంటి స్త్రీలందరూ ఋషికలే. గృహజీవనానికి స్త్రీయే పునాది అని ఋగ్వేదం చెప్పింది. శక్తిస్వరూపిణి అయిన స్త్రీని గౌరవించి, ఆరాధించే సంస్కృతి మనది. పరబ్రహ్మలోని స్త్రీ పరమైన గుణాలు, శక్తులు కలిసి 'స్త్రీ దేవతలు' అవతరించారు. వారి గురించి తెలుసుకుందాం.

లోపాముద్ర: అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర సంస్కృత, తమిళ భాషలలో నిష్ణాతురాలు. లోపాముద్ర అంటే తనలో తానే లీనమైన ఆత్మనిష్ఠాపరురాలు అని అర్థం. అగస్త్యునికి, లోపాముద్రకు మధ్య జరిగిన సంవాదం, లోపాముద్ర పాండిత్యం, గెలుపును ఋగ్వేదం ప్రశంసించింది. అగస్త్యుడు, లోపాముద్ర సాహచర్యంలో సంవాదాలలో భౌతిక, ఆధ్యాత్మిక జీవితంలోని పవిత్రతను, పూర్ణత్వాన్ని గ్రహించాడని చెబుతారు.

ఘోష: ఆమె దుర్గతమసుని మనుమరాలు. కక్షివంతుని కూతురు. దేవ వైద్యులైన అశ్వనీ కు మారులను స్తుతిస్తూ ఆ తండ్రీ కుమా రులు అనేక శ్లోకాలు రచించారు. పదవ ప్రకరణంలోని కొన్ని శ్లోకాలను తండ్రి, తాతగార్లతో సమానంగా ఘోష రచించింది. వాటిలోని ఒక శ్లోకంలో ఆమె అశ్వినులను వివాహం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడిస్తుంది. కుష్ఠువ్యాధిచే కురూపి అయిన ఆమెను అశ్వనీ దే వతలు తమ వైద్యంతో ఆరోగ్యవంతు రాలిని, అందగత్తెను చేసి పెండ్లి చేసుకొంటారు.

ఋగ్వేద మంత్ర ద్రష్ట మైత్రేయి: గొప్ప తాత్వికురాలు, ఋషిక అయిన మైత్రేయి కూడా ఋగ్వేద మంత్రాలను దర్శించింది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక ఆలోచనలను పరిణితి చెంచేలా చేయడంలో ప్రధానపాత్ర వహించింది. యాజ్ఞవల్క్యునికి కాత్యాయని అనే రెండవ భార్య కూడా ఉంది. ధర్మశాస్త్రాలు, వేదాలు బాగా చదివి, బ్రహ్మవాదినిగా మైత్రేయి ఘనత వహిస్తే, కాత్యాయని ఒక సాధారణ ఇల్లాలిగానే ఉండింది. ప్రాపంచిక చింతనలు విడిచి, సన్యాసికి అనువైన స్వీయ నియంత్రణ, సన్యాసి ప్రతిజ్ఞా పాలన చేయదలచి యాజ్ఞవల్క్యుడు ఒకరోజు తన ప్రాపంచిక ఆస్తిపాస్తులను తన ఇద్దరు భార్యలకు పంచదలిచాడు. ప్రపంచ సంపద తనకు శాశ్వతత్వాన్ని, ముక్తిని ఇవ్వలేదని భావించి మైత్రేయి తన భర్త నుండి కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ముముక్షత్వానికి కావలసిన శిక్షణను కోరుకొని మరీ పొందింది.



బ్రహ్మజ్ఞాని గార్గి: వాచక్న మహర్షి కూతురు, వైదిక ప్రవక్త గార్గి. మానవ అస్తిత్వానికి, ఉనికికి, జీవితానికి మూలమేమిటి అనే అంశంపై గార్గి అనేక వేదమంత్రాలను దర్శించింది. ఎందరో వేదాంత వేత్తలను వాదంలో గెలిచిన యాజ్ఞవల్క్యునికి ఆత్మానాత్మల విచారం గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి అనేక ప్రశ్నలను సంధించి గార్గి ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది.

గొప్ప విజ్ఞాని ఉభయభారతి: మధ్యయుగంలో తత్వవేత్త, మీమాంస, అద్వైత దర్శనాలలో ప్రవీణుడైన మండనమిశ్రుని భార్య అయిన ఉభయభారతి ఒక గొప్ప విజ్ఞాని. శ్రీ ఆదిశంకరాచార్యులకు, మండనమిశ్రునికి మధ్య జరిగిన అద్వైత సిద్ధాంత సంబంధిత వాదోపవాదాలకు ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. పక్షపాత రహితంగా ఆ వాదనలలో తన భర్తను కాక, ఆదిశంకరులనే విజేతగా ప్రకటించిన విదుషీమణి ఆమె.

ఆళ్వార్ ఆండాళ్: ఇంకా ఆ యుగంలో 'తిరుప్పావై' అనే భక్తి గీతాలను వ్రాసిన మొదటి మహిళా ఆళ్వార్ అండాళ్. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వంపై కవితలు వ్రాసిన కర్నాటకలోని శివ భక్తురాలు అక్క మహాదేవి. రాజస్థాన్ లోని కృష్ణ భక్తురాలు, సాంఘిక దురాచారాలను ప్రతిఘటించిన కవయిత్రి మీరాబాయి, సరళ భాషలో వేదాంతపరమైన నిగూఢార్థాలు చాటిచెప్పిన తత్వవేత్త లాలాదేవి, గ్రామీణుల సాధారణ జ్ఞానాన్ని వేదాంత విజ్ఞానంతో అనుసంధిస్తూ రచనలు చేసిన తమిళ కవయిత్రి అవ్వయ్యార్, ఇంకా సక్కుబాయి, ముక్తాబాయి, మదాలస, ఈ మధ్యకాలంలో తరిగొండ వెంగమాంబ, ఆదోని లక్ష్మమ్మ, జిల్లెళ్ళమూడి అనసూయమ్మ మొదలైన యోగినులు, అంతర్బుద్ధి సిద్ధులైన మహిళలు ఎందరో ఉన్నారు.

విజ్జిక: దండి మహాకవి తన ఒక రచనలో సరస్వతీ దేవిని తెలుపు దేహరంగు ఛ్చాయ కలదిగా వర్ణించాడు. విజయాంబిక (విజ్జిక) అనే కవయిత్రి నలుపురంగుతో ఉండేది. ఆమె దండి అభిప్రాయాన్ని ప్రతిఘటించింది. నల్లని దేహకాంతిగల అపర సరస్వతినైన నా గురించి తెలుసుకోకుండా సరస్వతి ధవళవర్ణిని అని దండికవి ఎలా అంటాడని ఆమె ప్రశ్నించింది. స్త్రీల ఆత్మవిశ్వాసానికి విజ్జిక ఒక ప్రతీక. ఇంకా గంగాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు రసవత్తర కావ్యాలు వెలువరించి పురుషులతో సమానంగా నిలిచినవారే.

ఆధ్యాత్మిక వేత్త గౌతమి: బౌద్ధయుగంలో గౌతమ బుద్ధుని పెంపుడు తల్లి అయిన మహా ప్రజావతి గౌతమి ఒక ఆధ్యాత్మికవేత్త. ఆమె కాక బౌద్ధ వేదాంత ధ్యాన సన్యాసినులు ఖేమ, ఉప్పలావన, రెండవ భాస్కరుని కూతురైన లీలావతి వంటి ఆధ్యాత్మిక వేత్తలైన స్త్రీలుండేవారు.

# స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది

## స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత

## వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య


## నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి

## అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్

## జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా







స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు. 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు. "అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

### సూర్య క్రేజీ లైనప్ వ్యూహాలు..

# సుప్రీమ్ ఛైర్ కోసమే?




తమిళ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేనంత ఆసక్తికరమైన ట్రేడ్ సమీకరణాలు నడుస్తున్నాయి. ఇండస్ట్రీని దశాబ్దాలుగా ఏలిన అగ్ర నటుడు దళపతి విజయ్ పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వెళ్ళిపోవడం.. మరో స్టార్ హీరో అజిత్ కుమార్ పూర్తి దృష్టిని రేసింగ్ ట్రాక్‌లపై కేంద్రీకరించడంతో కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద నెంబర్ వన్ స్థానానికి శూన్యత ఏర్పడింది. ఈ సింహాసనాన్ని దక్కించుకోవడానికి పలువురు హీరోలు పోటీపడుతున్న తరుణంలో విలక్షణ నటుడు సూర్య మైండ్ బ్లోయింగ్ అప్‌కమింగ్ లైనప్‌తో అందరికంటే ముందు వరుసలో నిలుస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన కరుప్పు (తెలుగులో వీరభద్రుడు) సాధించిన చారిత్రాత్మక విజయం ఈ రేసుకు మరింత ఆజ్యం పోసింది. ఇండస్ట్రీలో నెంబర్ వన్ స్థానాన్ని శాసించాలంటే కేవలం నటన మాత్రమే సరిపోదు. ట్రేడ్ వర్గాలను షేక్ చేసే తిరుగులేని బాక్సాఫీస్ స్టామినా అవసరం. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన -కరుప్పు- ప్రపంచవ్యాప్తంగా దాదాపు 340 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించడంతో సూర్య రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సంచలన విజయంతో సూర్య పూర్వ వైభవాన్ని అందుకున్నారు. విజయ్-అజిత్ అందుబాటులో లేని ప్రస్తుత తరుణంలో క్రేజీ కమర్షియల్ కథలతో వస్తున్న అగ్ర దర్శకులకు.. నిర్మాణ సంస్థలకు సూర్య ఫస్ట్ ఛాయిస్ ఐకాన్‌గా మారిపోయారు. ఈ క్రేజీ ప్రయాణంలో సూర్య తదుపరి అడుగును వ్యూహాత్మకంగా వేస్తున్నారు. టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య నటిస్తోన్న -విశ్వనాథ్ అండ్ సన్స్- చిత్రం ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుని ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, క్లాస్ - ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో సూర్యకున్న బలమైన మార్కెట్‌ను మరింత రెట్టింపు చేయడమే టార్గెట్ గా పెట్టుకుంది.

# హీరోయిన్లు రైటర్లు అవుతోన్న వేళ!



వెండి తెరపై హీరోయిన్లు మాత్రమే కాదు. అవసరం మేర కలం పట్టి రచయితలు అయిన నటీమణులు కొందరున్నారు. భానుమతీ రామకృష్ణ తెలుగు సినిమా చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలి. భానుమతి కేవలం హీరోయిన్ మాత్రమే కాదు.. రచయిత్రి గాను సేవలందించారు. తన ఆత్మకథ 'నాలో నేను' తో పాటు అనేక కథలు, పాటలు రాశారు. ఆమె రాసిన 'అత్తగారి కథలు' అప్పట్లో ఎంతో ప్రసిద్ధి. బాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించారు హనీ ఇరానీ. అటుపై హీరోయిన్ గా, అనంతరం ఇండియాలోనే టాప్ స్క్రీన్ రైటర్లలో ఒకరిగా ఎదిగారు.'లమ్హే', 'ఇనా', 'దర్', 'కహో నా ప్యార్ హై', 'క్రిష్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు కథలు అందించారు. ప్రస్తుత కాలంలో అత్యంత ప్రతిభావంతురాలైన నటి కొంకణా సేన్. 'ఏ డెత్ ఇన్ ద గంజ్' సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సౌత్ లో ఒకప్పుడు టాప్ హీరోయిన్ గా కొనసాగిన సుహాసిని మణిరత్నం కూడా రచయిత్రిగా ముద్ర వేసారు. 'తిరుడా తిరుడా', 'ఇద్దరు' సినిమాలకు డైలాగ్స్ రాయడంలో సహకరించారు. బాలీవుడ్ హీరోయిన్ కంగన రనౌత్ కూడా రైటర్ గా, దర్శకురాలిగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. కల్కి కోచ్లిన్ వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్ మాత్రమే కాదు రచయిత్రిగా కూడా గుర్తింపు పొందారు. 'ద గర్ల్ ఇన్ ఎల్లో బూట్స్' సినిమాకు కో-రైటర్‌గా పని చేశారు. వీరి బాటలోనే నవతరం నటీమణులు కెరీర్ ని నిర్దేశించుకుని ప్రయాణం ముందుకు సాగిస్తున్నారు. కీర్తి సురేష్ ఇప్పటికే సౌత్ లో ఎన్నో సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. బాలీవుడ్ లో కూడా అవకాశాలు అందుకుంటుంది. అంతేనా కెప్టెన్ కుర్చీ ఎక్కడానికి అమ్మడు సిద్దమవుతుంది. ఈ క్రమంలో సొంత కథలు రాయడం మొదలు పెట్టింది. సరైన కథ సిద్దమైన తర్వాత దర్శకురాలిగానూ మారడానికి రెడీ అవుతోంది. అలాగే సమంత సొంతంగా నిర్మాణ సంస్థను స్థాపించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా డైరెక్షన్ , రైటింగ్ టీమ్తో ఎన్నో స్క్రిప్ట్ డిస్కషన్స్ లో పాల్గొంటుంది. అవసరమైన సూచనలు, సలహాలు క్రియేటివ్ గా అందించే ప్రయత్నం చేస్తుంది. తాను కూడా సొంతంగా కథలు రాసే ఆలోచనలో ఉంది. మల్టీ ట్యాలెంటెడ్ బ్యూటీ శ్రుతి హాసన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. నటిగా, గాయనిగా, మ్యూజిషియన్ గా సత్తా చాటుతుంది. అవసరం మేర సాహితి వేత్తగానూ మారిపోతుంది. ఇందులో మరింత ప్రొఫెషనల్ కావాలను కుంటుంది. డాడ్ కమల్ హాసన్ తరహాలో స్క్రిప్ట్ లు కూడా రాయాలనుకుంటోంది. వరలక్ష్మి శరత్ కుమార్ ఇప్పటికే నటిగా సత్తా చాటింది. 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగానూ ఎంట్రీ ఇస్తుంది. సక్సెస్ అయిందంటే? కెప్టెన్ కుర్చీని కంటిన్యూ చేసే అవకాశాలున్నాయి. అలాగే మలయాళం బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ రైటర్ గా మారే ఆలోచనలో ఉంది.





# పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి

## సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నానన్న శ్రీముఖి

## తాను కోరుకున్న వ్యక్తి దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని వెల్లడి

## త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పండి అంటూ నెటిజన్ల స్పందన



యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖ కీలక పాత్ర పోషించింది.

# కల్కి సీక్వెల్.. సాయిపల్లవి కాకపోతే మరెవరు?






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీ సినిమా భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే పోషించిన సుమతి (సమ్-80) కోల్ స్టోరీలో కీలకంగా నిలిచింది. మూవీ మొత్తం ఆ పాత్ర చుట్టూనే తిరగడంతో, ఇప్పుడు రూపొందుతున్న కల్కి-2లో సుమతి రోల్ ను ఎవరు పోషిస్తారన్నది హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఆ రోల్ కు సంబంధించిన అనేక రకాల వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొన్ని కాల్షీట్ల సమస్యలు, ఇతర కారణాల వల్ల దీపికా పదుకొనే సీక్వెల్ నుంచి తప్పుకున్నారు. దీంతో ఆమె ప్లేస్ లో కొత్త హీరోయిన్ కోసం మూవీ టీమ్ సెర్చ్ చేసినట్లు తెలిసింది. ఆ సమయంలో బాలీవుడ్ బ్యూటీ అలియా భట్, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా పేర్లు వినిపించాయి. ఆ తర్వాత నేచురల్ బ్యూటీ సాయి పల్లవి పేరు తెరపైకి వచ్చింది. సుమతి పాత్రలో కనిపించేది ఆమెనేనని, ఇప్పటికే సెలెక్ట్ చేశారని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. అంతేకాదు, ప్రభాస్ తో కలిసి సాయిపల్లవి షూటింగ్ లో పాల్గొనాల్సి ఉండగా, ఆమె ఆరోగ్య సమస్యల కారణంగా షెడ్యూల్ వాయిదా పడిందంటూ మరో రూమర్ కూడా వైరల్ అయింది. కంప్లీట్ ఎమోషన్స్ తో నిండిన సుమతి రోల్ కు సాయిపల్లవి న్యాయం చేయగలదని, సరైన సెలక్షన్ అవుతుందని అభిమానులు కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఆ ప్రచారాలన్నింటికీ దర్శకుడు నాగ్ అశ్విన్ తాజాగా చెక్ పెట్టారు. కల్కి-2కి సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సినిమాలో సుమతి పాత్ర చాలా మెయిన్ అని, ఆ పాత్రను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. అలాగే, సుమతి పాత్ర కోసం సాయిపల్లవిని ఎంపిక చేశారన్న వార్తలను కూడా ఆయన ఖండించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. సరైన సమయంలో ఆ పాత్రకు సంబంధించిన అధికారిక వివరాలను అనౌన్స్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే కల్కి-2కి సంబంధించిన రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. సెప్టెంబర్ నుంచి సినిమా షూటింగ్ నాన్ స్టాప్ గా కొనసాగుతుందని చెప్పారు. ఏదేమైనా సుమతి పాత్ర విషయంలో నెలకొన్న సస్పెన్స్ కు దర్శకుడు కొంతవరకు తెరదించినా.. ఆ రోల్ లో చివరికి ఎవరు కనిపిస్తారన్న ప్రశ్నకు మాత్రం ఇంకా ఆన్సర్ రాలేదు. సాయిపల్లవి పేరు ప్రచారంలో ఉన్నప్పటికీ, అది నిజం కాదని నాగ్ అశ్విన్ స్పష్టం చేయడంతో అభిమానులు ఇప్పుడు అనౌన్స్మెంట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో వస్తున్న కల్కి సీక్వెల్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా స్టోరీలో కీ పాయింట్ గా నిలిచిన సుమతి పాత్రను ఎవరు పోషిస్తారనేది ఇప్పుడు కల్కి-2కి సంబంధించి బిగ్గెస్ట్ క్వశ్చన్ గా మారింది. అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే వరకు ఆ రూమర్లకు తెరపడే అవకాశాలు కనిపించడం లేదు. మరి సాయి పల్లవి కాకుండా ఎవరు యాక్ట్ చేయనున్నారో వేచి చూడాలి.

EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016